ఎమ్మెల్సీ ఎన్నికలకు 20 పోలింగ్ కేంద్రాలు

ఏలూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు 2,659 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. నామినేషన్ల స్వీకరణకు ఈనెల 18 వరకు గడువు ఉన్నందున అప్పటి వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు.

శ్రీవారి జల విహారం



క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని ద్వారకాతిరుమల చినవెంకన్న ఉభయనాంచారులతో కలిసి జల విహారం చేశారు. సుదర్శన పుష్కరిణిలో హంసవాహనంపై ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్ల జలవిహారం భక్తులకు నేత్రపర్వమైంది. మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపకాంతులు, బాణసంచా వెలుగులు, కోలాట భజనలు, డప్పువాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలు, అర్చకుల వేదఘోష నడుమ జరిగిన తెప్పోత్సవం చూపరులకు కనువిందు చేసింది.

6లో



ఐటీడీఏ పీవో ధాత్రిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న గిరిజనులు

పర్యాటకంతో గిరిజనులకు ఉపాధి కల్పించాలి

- గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీవోకు కొండరెడ్ల వినతి

బుట్టాయగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ ద్వారా గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జేసీ, ఐటీడీఏ పీవో పి.ధాత్రిరెడ్డికి కొండరెడ్లు విన్నవించారు. ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పోలవరం మండలం కొరుటూరు, చీడూరు, టేకూరు, తెల్లదిబ్బలు గ్రామాలకు చెందిన కొండరెడ్లు వినతిపత్రం అందజేశారు. గతంలో ఏపీ టూరిజం ద్వారా ఉపాధి పొందిన తాము గ్రామాలు ఖాళీకావడంతో ఉపాధి కోల్పోయామని రాంగోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పోసిరెడ్డి, పోసిబాబురెడ్డి, సాంబశివరెడ్డి, వెంకటరెడ్డి, రాంబాబురెడ్డి తదితరులు వివరించారు. పాపికొండల విహార యాత్రకు వచ్చే యాత్రికులకు సేవలందించడం ద్వారా ఉపాధి పొందేవారమన్నారు. కొరుటూరు, శిరివాకలో కాటేజీలు శిథిలయమయ్యాయని, తిరిగి నిర్మించాలని కోరారు. జేసీ కొండరెడ్ల ఉపాధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏజెన్సీలో ఆదివాసీల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. పలువురు గిరిజనులు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అన్ని ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని పీవో ధాత్రిరెడ్డి హామీ ఇచ్చారు.



పరుగు పందెం పోటీలు ప్రారంభించిన ఎస్పీ కేపీఎస్ కిశోర్

బాలల వికాసానికి క్రీడలు దోహదం : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలల మనో, శారీరక వికాసానికి క్రీడలు చాలా దోహదపడతాయని ఎస్పీ కేపీఎస్.కిశోర్ అన్నారు. సురేష్‌చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలను పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ఎస్పీ కిశోర్ ప్రారంభించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదువుల్లో ముందంజలో ఉంటారని, నిత్యం వ్యాయామానికి సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, స్కూలు హెచ్ఎం వివి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

అపరాలు, వరి విత్తనాలు సిద్ధం : హబీబ్‌బాషా

ఏలూరు సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల రైతులకు అవసరమైన అపరాలు, వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కలిదిండి, మండవల్లి, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అపరాలు విత్తనాలు సిద్ధం చేశామన్నారు. రైతు సేవా కేంద్రాలలో నిర్దేశించిన గడువు లోపలే విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని, ఏపీ సీడ్స్ ఏలూరు గొడౌన్‌లో కూడా అపరాలు విత్తనాలు ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల కారణంగా కొన్ని మండలాలకు విత్తనాలను సరఫరా చేయలేదన్నారు. వీటిపై స్పష్టత వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు.

పడవ ప్రయాణం.. ప్రమాదం



ఉప్పుటేరుపై పెదలంక పల్లిపాలెం వాసుల పడవలో రాకపోకలు

కలిదిండి మండలం పెదలంక పల్లిపాలెం ఉప్పుటేరు వద్ద పడవ ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అనుమతి లేకుండా పడవ నడుపుతున్నా పట్టించుకున్న వారే లేరు. పెదలంక పల్లిపాలెం, పెదపుట్లపూడి, రామకృష్ణాపురం, మూల్లంక, కల్వపూడి మోడీ గ్రామాల ప్రజలు నిత్యం పడవపై ఉప్పుటేరు దాటాల్సిందే. పశ్చిమ గోదావరి జిల్లాకు సరిహద్దున ఉండడంతో విద్యార్థులు భీమవరం కళాశాలలకు వెళతారు. ఉప్పుటేరు ఆవల చేపల చెరువులకు రైతులు ప్రతీరోజు పడవ దాటాల్సిందే. ప్రైవేట్ వ్యక్తులు పడవ నడుపుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. - కలిదిండి

నేటినుంచి ఇంటింటికీ క్యాన్సర్ పరీక్షలు

డీఎంహెచ్‌వో శర్మిష్ట

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా ఇంటింట క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా చేపట్టనున్నట్లు జిల్లా వైద్యాధికారి శర్మిష్ట తెలిపారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు ప్రత్యేక బృందం ఇంటింటికీ వెళ్ళి పరిశీలిస్తారన్నారు. 18 ఏళ్ల పైబడిన యువతులు, వివాహితలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన, 30ఏళ్ల పైబడిన మహిళలకు గర్భాశయ క్యాన్సర్ అనుమానిత లక్షణాలుంటే సమీప ఎంఎల్‌హెచ్‌పీ సెంటర్‌కు తీసుకెళ్ళి గైనకాలజిస్టులు, అంకాలజిస్టుల వద్దకు చికిత్స చేయిస్తారని వివరించారు.

ఊపిరితిత్తుల సమస్యలతో (న్యుమోనియా) బాధపడుతున్న ఐదేళ్లలోపు చిన్నపిల్లలను గుర్తించేందుకు బుధవారం నుంచి వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తారని శర్మిష్ట తెలిపారు. పిల్లలకు శ్వాసకోశ సంబంధిత సమస్యలు గుర్తిస్తే వైద్యుల వద్దకు తీసుకెళతారన్నారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 1.30 లక్షల మంది ఉన్నారని, వారందరినీ ఏఎన్ఎం, ఆశ వర్కర్‌లతో కూడిన బృందాలు పరిశీలిస్తాయన్నారు. చలికాలంలో వాయుకాలుష్యం అధికమని, న్యుమోనియాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. 70 ఏళ్ల పైబడిన వారి ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఆరోగ్య బీమా రూ.10 లక్షలకు పెంచుతూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని అమల్లోకి తెచ్చిందని వివరించారు. ఆయుష్మాన్ భారత్(పీఎంజేవై) స్కీంలో జిల్లాలో 9లక్షల మంది అర్హులు ఉన్నారని, సవరించిన పథకంలో 1.50 లక్షల మంది సీనియర్ సిటిజన్లు చేరే అవకాశం ఉందన్నారు.

ప్రభుత్వ శాఖల తడబాటు



జడ్పీ.. సాగునీటి సలహా మండలి సమావేశాలు రద్దు

కీలక, సాధారణ నిర్ణయాలు తీసుకోవడంలో అధికారులు తడబడుతున్నారు. జిల్లా స్థాయి సమావేశాల ఏర్పాటులో రాష్ట్రస్థాయి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుని ఆనక నాలుక కరుచుకుని తూచ్ అంటున్నారు. జడ్పీ సమావేశం జరుగుతుందని ఉమ్మడి జిల్లా సభ్యులందరికీ వర్తమానం ఇచ్చారు. తీరా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణమంటూ సమావేశం జరిగే రోజు సడెన్‌గా రద్దు చేశారు. తర్వాత సాగునీటి సలహా మండలి సమావేశం అన్నారు. ఆనక అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఈ సమావేశం రద్దు అన్నారు..!

- ఈ వారంలో రెండు ప్రభుత్వం శాఖల తీరు ప్రశ్నార్థకం
- ఎన్నికల కోడ్ ఉన్నా జడ్పీ ప్రత్యేక సమావేశానికి ఓకే
- ఆనక సమావేశం రద్దు
- అదే బాటలో సాగునీటి సలహా మండలి సమావేశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఒక కీలక అంశంపై నిర్ణయం తీసుకోడానికి అధికారులు తడబడుతున్నారు. ముందు నిర్ణయం తీసుకుని ఆనక తూచ్ అంటున్నారు. ఈ నెల 11న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సభ్యులందరికీ రెండు రోజులు ముందుగానే వర్తమానం పంపించారు. సోమవారం ఉదయం 9 సమావేశమని సభ్యులకు సమాచారం ఇవ్వడంతో దూర ప్రాంతాల వారంతా ఆదివారం రాత్రికి ఏలూరు చేరుకుని హోటళ్లలో బస చేశారు. తీరా సమావేశాన్ని రద్దు చేస్తున్నామంటూ అకస్మాత్తుగా ప్రకటించారు. దీంతో విసుగెత్తిన జడ్పీటీసీ సభ్యులంతా నిరసనకు దిగారు. తామంతా ఏలూరు చేరుకున్న తరువాత సమావేశం రద్దు అంటూ ఎందుకు కబురు పంపారని నిలదీశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశం రద్దు చేసినట్లు సీఈవో సభ్యులకు జవాబు ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాజాగా సాగునీటి సలహా మండలి సమావేశం మంగళవారం జరగబోతుం దని ముందస్తుగా ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో సమాంతరంగా జిల్లాల్లో సమావేశం సరికాదని సాగునీటి సలహా మండలి సమావేశాన్ని రద్దు చేశారు.

కోడ్ నిబంధనలు తెలిసీ..!

వాస్తవానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఈనెల 11 నుంచి అమలులోకి వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ముందే ప్రకటించారు. దీనికనుగుణంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై పంచాయతీరాజ్ చట్టం అనుగుణంగా అనర్హత వేటువేయాలని వైసీపీ సభ్యులంతా పట్టుపడుతున్నారు. ప్రత్యేక సమావేశంలో ప్రస్తావించాలని ఆ పార్టీ సభ్యులు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 11న జడ్పీ సమావేశం సమాచారం విడుదల చేశారు. సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌కు నివేదించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రత్యేక సమావేశం ఎలా నిర్వహిస్తారని కలెక్టర్ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో అధికారులు నాలుక కరుచు కుని సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల కోడ్ అమలుపై జడ్పీ అధికారులకు అవగాహన లేకపోవడం, సభ్యులే గట్టిగా నిలదీసినప్పుడు సమాధానం చెప్పలేక నీళ్లు నమలాల్సి వచ్చింది. వాస్తవానికి జిల్లా పరిషత్‌లో ఇలాంటి విషయాల్లో పరస్పరం చర్చించుకున్న తరువాతే తుది నిర్ణయా నికి వస్తారు. జడ్పీ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సమావేశం పెట్టాలని నిర్ణయించినప్పుడు జడ్పీలో అధికారులు ఎందు కు తడబడ్డారో, జడ్పీటీసీల ముందు ఎందుకు చులకన య్యారనేదే ప్రశ్న.

అసెంబ్లీ సమావేశాల వేళ..!

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించదలిస్తే ముందస్తుగా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపై స్పష్టత వచ్చిన తరువాతే కీలక సమావేశం నిర్వహణ తప్పదనుకున్నప్పుడు తుది నిర్ణయం తీసుకుంటారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం నేరుగా జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశానికి డెల్టా పరిధిలో ఎమ్మెల్యేలు హాజరుకావాల్సి ఉంది. ఒకవైపు అసెంబ్లీ, ఇంకోవైపు ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల అధికారిక సమావేశాలకు ఎమ్మెల్యేలు హాజరుకావాల్సి వచ్చింది. దీంతో సాగునీటి సలహా మండలి సమావేశాన్ని అర్థాంతరంగా రద్దు చేయాల్సి వచ్చింది. జడ్పీ అధికారుల మాదిరి ఇరిగేషన్ అధికారులు కూడా తడబడినట్టే చెబుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఒకటికి రెండుసార్లు మంత్రులు, ఎమ్మెల్యేల రాక అనుమతులు తీసుకుని సమావేశ తేదీలను నిర్ణయించాల్సి ఉంది. కాని జిల్లాలో అలా జరుగుతున్నట్లు కనిపించలేదు. సమావేశం నిర్వహిస్తామని ఒకసారి, రద్దు చేస్తున్నట్లు ఇంకోసారి ప్రకటించాల్సి వచ్చింది. అసెంబ్లీ సమావేశాల వేళ ముఖ్యమైన జిల్లా స్థాయి సమావేశాలు ఉంటే శని, ఆదివారాల్లో కూడా ఇంతకుముందు నిర్వహించిన దాఖలాలు లేకపోలేదు. జిల్లాలు విడిపోయిన తరువాత ఇలాంటి తడబాటు వ్యవహారాలు పునరావృతమవుతున్నట్లు కనిపిస్తుంది.

చిక్కుకుంటే చిక్కులే..



సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై ప్రభుత్వం ఉక్కుపాదం

వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుత హోం శాఖ మంత్రి వంగలపూడి అనితపై అసభ్య పదజాలంతో ట్రోల్ చేసిన ఉమ్మడి గుంటూరు జిల్లా నకిరేకల్‌కు చెందిన పావులూరి రాజశేఖర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి, బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు మెయిన్‌లో..

- పాత కేసులను తవ్వితీస్తూ.. కేసులు నమోదు చేస్తున్న పోలీసులు
- కొత్త చట్టాలతో మరింత కఠిన శిక్షలు
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దంటున్న పోలీసులు

అత్తిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):సోషల్ మీడియా లో ఇష్టానుసారం పోస్టులు పెడితే జీవితాంతం కేసులు వెంటాడతాయి. రాజకీయ పార్టీల నాయకుల మెప్పు కోసమో, వారిపై అభిమానంతోనే.. మరేదైనా కారణం తోనో ఇష్టానుసారం పోస్టులు పెడితే తమతోపాటు కుటుంబ సభ్యులను ఇబ్బందుల్లోకి నెట్టినట్టే. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ సానుభూతిపరులు, మరికొందరు ఉన్మాదుల్లా వ్యవహరించి కేవలం కొన్ని కుటుంబాలను టార్గెట్ చేస్తూ వారి ఇళ్లల్లోని మహిళల ను కించపరచే విధంగా పోస్టులు పెట్టారు. వీటిని ప్రశ్నించిన, కౌంటర్ పోస్టులు పెట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సానుభూతిపరులను వెంటాడి అరెస్టు చేశారు. వైసీపీ నాయకులు అసభ్యకర పోస్టులు పెట్టినా విమర్శలు గుప్పించినా వారిని అరెస్టు చేయ లేదు. వైసీపీ ఘోర పరాజయం పాలై, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ఇప్పటికీ ఆ పార్టీకి చెందిన సోషల్ మీడియా బృందాలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు రాజకీయాల్లో లేని వారిపైన, మీడియా ప్రతినిధులపై అసభ్యకర పోస్టులు పెడుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అలాంటి సైకోలపై చర్యలకు ఉపక్రమించింది. రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి వైసీపీ సోషల్ మీడియా విభాగం చేస్తున్న అరాచకాల్లో ఇరుక్కుంటే జీవితం సర్వనాశనమే.

అసభ్యకర పోస్టులు చేస్తే జైలుకే

అవతలి వ్యక్తులను ఇష్టానుసారంగా తిడుతూ మార్ఫింగ్ ఫొటోలు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. సభ్య సమాజం సిగ్గు పడేలా సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్, యూట్యూబ్ వంటి వాటిల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇలాంటి పోస్టులపై జిల్లా స్థాయి పోలీసు విభాగం సైబర్ క్రైం టీమ్ సునిశితంగా పరిశీలిస్తోంది. ప్రతి పోలీస్ స్టేషన్‌లో వీటిపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటి వరకూ జిల్లాలో 15కి పైగా కేసులు నమోదయ్యాయి. ఒకసారి ఈ కేసుల్లో ఇరుక్కుంటే వారి జీవితం పూర్తిగా పాడైనట్టే.

ఇలా చేయడం నేరం

- ఉద్దేశ పూర్వకంగా గాని, దురుద్దేశంతో గాని వ్యక్తిత్వ హననానికి పాల్పడే సమాచారాన్ని ప్రజలకు చేరవేయకూడదు. అసత్య ప్రచారం చేయకూడదు.
- ఎదుటి వ్యక్తులు కుటుంబాలను ఉద్దేశించి దూషిస్తూ అసభ్యకరంగా పోస్టులు పెట్టరాదు. వీటికి లైక్‌లు కొట్టడం ఇతరులకు ఫార్వర్డ్ చేయడం నేరం.
- ప్రజల మధ్య, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చే పోస్టులు చేస్తే జైలుకు వెళ్లక తప్పదు.
- చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే వారిపై కేసులు నమోదైతే పోలీసులు ఎన్ఓసీ ఇవ్వరు. ఇది లేకపోతే ఉద్యోగాలు రావు.
- ఒకసారి కేసు నమోదైతే నిరంతర నిఘా ఉంటుంది. పిల్లలు, తల్లిదండ్రులకు ఇబ్బందే. తప్పు చేసిన పిల్లలు దొరక్కపోతే తల్లిదండ్రులు తిరగాల్సిందే.

కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయి ?

భారతీయ న్యాయ సంహిత (బీఎస్ఎన్ఏసీ) ఐటీ సైబర్ నేరాల చట్టాలు ఉన్నాయి. ఫేస్ మార్ఫింగ్ చిత్రాలు, వీడియోలు వైరల్ చేయడం ద్వారా ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడితే 67 ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారు.

- ప్రముఖుల పేరుతో పోస్టులు పెడితే 66 డీఐటీ యాక్ట్ నమోదు చేసి మూడేళ్ల జైలు, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారు.
- జుగుప్సాకరంగా ఉన్న చిత్రాలు వీడియో ఆన్‌లైన్‌లో వ్యాప్తి చేస్తే ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌గా పరిగణించి బీఎన్ఎస్ చట్టంలో 353(2) సెక్షన్ కింద కేసు నమోదవుతుంది.
- అసభ్యకర పోస్టులు రూపొందించి అప్‌లోడ్ చేస్తే 67 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. ఐదేళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా.
- తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పరువుకు భంగం కలిగిస్తే బిఎస్ఎన్ చట్టం 336(4) సెక్షన్ కింద కేసు.
- సమాజంలో సంఘాలు, సమూహాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే 356 (2) సెక్షన్‌తోపాటు పరువునష్టం కేసులు కడతారు.

ఏలూరు జిల్లాలో 11 సోషల్ మీడియా కేసులు.. ఆరుగురి అరెస్ట్

ఏలూరు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):సోషల్ మీడియాల్లో ఇతర వ్యక్తులను అవమాన పరుస్తూ, అవహేళన చేస్తూ వారి గౌరవానికి భంగం కల్గించేలాగ మానసిక వేదనకు గురిచేస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. జిల్లాలో 11 కేసులు నమోదు చేయగా వీటిలో నిందితులుగా ఉన్న వారందరూ వైసీపీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టులే. ఇప్పటికే ఆరు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేశారు. వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ధర్మాజీగూడెం, ఏలూరు వన్‌టౌన్, నూజివీడు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసులో వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను అరెస్టు చేశారు. జిల్లాలో మరి కొన్నికేసుల్లో కూడా అతన్ని అరెస్టు చూపించాల్సి ఉంది. ఒకటి, రెండు రోజుల్లో మిగిలిన వారిని అరెస్టు చేయడానికి పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. సోషల్ మీడియాను ఆసరా చేసుకుని వివిధ పార్టీలను, నాయకులను, వ్యక్తులను అవమాన పరిచినా వారి గౌరవానికి భంగం కల్గించినా సహించేది లేదంటూ పోలీస్ యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది.

సత్తా చాటుతున్న చిన్నారులు

అథ్లెటిక్స్‌లో అదరగొడుతున్న డింపుల్



ఎటువంటి సౌకర్యాలు లేనప్పటికి క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతోంది ఏలూరుకు చెందిన డింపుల్ మహాశ్రీ.. తండ్రి సాయిబ్రహ్మ స్వర్ణ కారుడిగా పనిచేస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికి తల్లి ఝాన్సీ తమ కుమార్తెను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నది. మంచి క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పోటీలు జరిగే ప్రాంతాలకు స్వయంగా తీసుకువెళుతున్నారు. డింపుల్ 8వ ఏట నుంచి పరుగు ప్రారంభించింది. సరైన క్రీడా సౌకర్యాలు లేనప్పటికి చదువుతున్న పాఠశాలల్లోనే సాధన చేసేది.. క్రీడలపై ఉన్న ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించారు. అదే పట్టుదలతో జాతీయస్థాయిలో రాణిస్తూ పతకాలు సాధిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో 9 బంగారు, రెండు వెండి, మూడు రజత పతకాలు దక్షిణ జాతీయ స్థాయిలో రెండు బంగారు, ఒక రజత పతకం, ఆల్ ఇండియా జూనియర్ నేషనల్స్‌లో వెండి పతకం, ఐదుసార్లు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను సాధించింది. భువనేశ్వర్‌లో జరుగునున్న నేషనల్ స్కూల్‌గేమ్స్, జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది.

చదరంగంలో అదుర్స్..ఈ బ్రదర్స్



చదరంగం అంటే మేధస్సుకు పదును పెట్టే క్రీడ.. ఏలూరుకు చెందిన అన్నాతమ్ముళ్ళు ఈ క్రీడలో రాణిస్తున్నారు. జరిగిన ప్రతి టోర్నమెంట్‌లోనూ విజయ పరంపర కొనసాగిస్తున్నారు. చదువులో మంచి మార్కులు సాధిస్తూనే చదరంగంలో పతకాలు సాధిస్తున్నారు.వారి అభిలాషకు తల్లిదండ్రులు వెన్నంటే నిలుస్తున్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి రేటింగ్‌లోనూ విజయం సాధించారు. 5వ తరగతి చదువుతున్న గంజి అనురూప్ మోషే 4వ ఏటనే చదరంగం నేర్చుకున్నాడు. ఇప్పటివరకు ఏలూరు జిల్లా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అండర్ -9 విభాగంలో సుమారు 70 బహుమతులు అందుకున్నాడు. ప్రపంచ ఛాంపియన్‌గా నిలవాలన్నదే అతని కోరిక. ఇతని సోదరుడు అభిషేక్ అవరహం అమలోద్భవి స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. ఇతను కూడా నాల్గవ ఏట నుంచే పతకాలవేట సాగించాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. రాష్ట్రస్థాయిలో రెండుసార్లు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒకసారి ప్రథమస్థానం సాధించాడు. ఇటీవల అంతర్జాతీయ ఫైడ్ రేటింగ్, క్లాసికల్ రేటింగ్, ర్యాపిడ్ రేటింగ్‌లలో, జిల్లాబ్లిచ్‌రేటింగ్‌లలో ప్రథమస్థానం సాధించి, రాష్ట్రస్థాయిలో అండర్ -11 విభాగం 5వ స్థానం సాధించాడు. తల్లిదండ్రులు జి.యోహానస్, అరుణ కూడా చెస్ క్రీడా కారులే. సాధిస్తున్న వరుస విజయాలు తమకు ఆనందం కలిగిస్తున్నాయని ఆర్థికంగా కష్టాలు ఎదురైనా టోర్నమెంట్‌లకు తీసుకువెళుతున్నామని చెప్పారు.

రికార్డులు సృష్టిస్తున్న జాగృతి



అవార్డులు అందుకుంటున్న జాగృతి

ఏలూరుకు చెందిన నారాయణం జాగృతి చిన్ననాటి నుంచే రికార్డుల పరంపర సాగిస్తోంది. 2017 నుంచి రికార్డుల ప్రస్థానం మొదలైంది. శతాధిక చిత్రధారణ ప్రదర్శన, శతక పద్యధారణ , త్రిశతాధిక ప్రశ్నోత్తరాలు, సామెతలు, హిందీ వ్యాఖ్యలకు తెలుగు అనువాదం, స్పెల్లింగ్ రియాక్షన్, దేశభక్తుల ఛాయాచిత్రాల దారణ ప్రదర్శన ఇలా 60 విభాగాల్లో ఆమె రికార్డులను సొంతం చేసుకుంది. తాజాగా బాలల దినోత్సవ వేళ మంగళవారం ఏలూరులో సహస్రాదిక ప్రశ్నోత్తర ప్రహేళికలో 10 విభాగాలకు సంబంధించి 100 నిమిషాల్లో వెయ్యికి పైగా ప్రశ్నలు, జవాబులు చెప్పి తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, సూపర్‌కిడ్ రికార్డును సొంతం చేసుకుంది. తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ సూపర్‌కిడ్స్ రికార్డ్స్ ముఖ్య సమన్వయకర్త సిరిమువ్వ శ్రీనివాస్ పర్యవేక్షించి జాతీయస్థాయిలో జాగృతి రికార్డులు సాధించినట్లు ధ్రువీకరించారు. ఏలూరు కె.కె.ఆర్ గౌతమ్‌లో 6వ తరగతి చదువుతోంది. ఆమె తండ్రి శివశంకర్ కూడా 72 గంటల నిర్విరామ హిందీ వ్యాకరణ బోధనలో గిన్నిస్‌వరల్డ్ రికార్డు విజేతగా నిలిచారు. 24 గంటల నిర్విరామ జాతీయ గీతా లాపనలో లిమ్కా బుక్‌ఆఫ్ రికార్డు సాధించారు. శతాధిక జాతీయ రికార్డుల సృష్టికర్త, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా ఆయన సొంతం చేసుకున్నారు.

- ఏలూరు రూరల్

బాల్యం వికసించాలి

నేడు బాలల దినోత్సవం



నేటి బాలలే రేపటి పౌరులు. బాలల బంగారు భవిష్యత్తు తీవ్ర ఒత్తిడిలకు లోనువుతోంది. తల్లిదండ్రుల వద్ద ఉండాల్సిన వారి బాల్యం హాస్టల్స్‌లో మగ్గిపోతోంది. ఇది బాలల జీవితాలపై ప్రభావం చూపడమే కాదు.. పెద్దవారయ్యాక మానసిక సమతుల్యం కోల్పోతున్నారు. బాల్యం.. భగవంతుడు ఇచ్చిన ఓ వరం. అభం శుభం తెలియని ఆ పసి మనసులు పూతోటలో విరిసిన పువ్వులు. చిరు గులాబి లాంటి బాల్యాన్ని వికసించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు , విద్యాశాఖాధి కారులకు ఉంది. నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

ఇటీవల కాలంలో బాలల హక్కులను తల్లిదండ్రులే తమకు తెలి యకుండా హరించేస్తున్నారు. తమ ఆశల కోసం, ఆశయాల కోసం తమ పిల్లలపై విపరీతమైన మానసిక ఒత్తిడి పెడుతూ వారిని సంక్షోభానికి గురిచేస్తున్నారు. తొలి రెండేళ్లు అల్లారుముద్దుగా చూసు కొనే తల్లిదండ్రులు మూడో ఏడు వచ్చినప్పటి నుంచి పిల్లవాడిని ఏ..స్కూల్‌లో చదివిస్తే బావుంటుందనే ఆలోచనలతో పిల్లలపై ఒత్తిడి పెంచుతూ మానసిక వికాసం దెబ్బతినేలా చేస్తున్నారు. సరిగ్గా అన్నం కూడా తినడం రాని పిల్లలకు ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చావగొడుతున్నారు.

తొలిసారిగా మనదేశంలో 1948 నవంబరు 5న ఫ్లవర్స్‌డేగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. తొలి ప్రధాని నెహ్రూకు బాలలు అంటే ఇష్టం..1954 నవంబరు 14న ఢిల్లీలో సుమారు 50 వేల మంది బాలల మధ్య ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. తదనంతరం కేంద్రప్రభుత్వం 1957 నవంబరు 14న అధికారికంగా బాలల దినోత్సవం ప్రకటించింది.

సృజనాత్మకతకు పాతర

మారుతున్న పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు పిల్లలను మార్కుల సాధకులుగా చూడడం చాలా దురదృష్టకర పరిణామం.విద్యార్థుల్లో నైపుణ్యాలను బయటకు తీసుకురావడమే నిజమైన విద్య. కార్పొరేట్ విద్యాసంస్థలు తమ విద్యార్థులకు కొన్ని ముఖ్యమైన సబ్జెక్టులలో అత్యధిక మార్కులలో సాధించేలా ప్రత్యేక తర్ఫీదునిచ్చి వారి నైపుణ్యాలకు అణచివేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ వంటి లాంగ్వేజెస్‌తో పాటు సోషల్ సబ్జెక్టును సంవత్సరం అంతా బోధించ కుండా కేవలం మూడు నెలల్లో ముఖ్యమైన ప్రశ్నలు చదివించి పరీక్షలు రాయిస్తున్నారు. ఈ సబ్జెక్టులపై భావితరాలకు సరైన అవగాహనే ఉండదు. పిల్లలను మార్కులు తెచ్చే యంత్రంగా కార్పొరేట్ సంస్థలు నూరిపోస్తున్నాయి. ఈ ఒత్తిడిలో వారిలో సహజ సిద్ధంగా వచ్చే ఆలోచనాశక్తి, సృజనాత్మకత, సమయస్ఫూర్తి పూర్తిగా దెబ్బతింటోంది. విద్యార్థుల్లో నైపుణ్యాలను కొలిచి ఆ నైపుణ్యాలకు తగిన విద్యను విద్యార్థులకు అందించేలా విద్యా సంస్కరణలు ప్రభుత్వం తీసుకు రావాలి.

విద్య వైరితలలు

కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థల ప్రకటనలు చూస్తుంటే ఆశ్చర్య మేస్తుంది. 1 వ తరగతి నుంచే ఐఐటీ సిలబస్ చెబుతాం అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు.తల్లిదండ్రులు కూడా మా అబ్బాయి 1వ తరగతి నుంచే ఐఐటీ కోచింగ్ తీసుకొంటున్నాడని చుట్టాలకు గొప్పగా చెప్పుకుంటూ పిల్లల జీవితాలను నాశనం చేస్తున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ ఎంట్రన్స్ పరీక్షల కోసం వయసుకు మించిన పాఠాలు చెబుతూ విద్యార్థుల బుర్రలను తినేస్తున్నారు. చదువులో ప్లెజర్ పోయి ప్రెజర్ పెరిగిపోయింది. ఒత్తిడి లేని చదువులు పోవాలంటే ముందు పరీక్షా విధానంలో మార్పులు రావాలి. ఒక్కో గదిలో కూర్చొని బట్టీపట్టీ మార్కులు సాధించే విద్యావ్యవస్థ కాకుండా రకరకాల కృత్యాలతో విద్యార్థుల అభిరుచులను, సామ ర్థ్యాలను పరీక్షించే పరీక్షా విధానం రావాలి. దీనికి కోసం ఇటు విద్యావేత్తలు పరిశోధన చేయాలి.అటు తల్లిదండ్రులు విధానంలో మార్పు రావాలి.

ఆటపాటలకు చోటేది

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీసం ఆటలను పరిచయం చేయని పాఠశాలలు ఎన్నెన్నో. ఆటలకు చోటివ్వని ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు ఇటీవల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కూడా పిల్లలకు ఆటలను పరిచయం చేయలేకపోతున్నారు. అక్కడక్కడా ఆటలు ఆడిస్తుంటే తల్లిదండ్రులు కోప్పడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. మా పిల్లలకు ఆటలెందుకని పేరెంట్స్ ఆయా విద్యాసంస్థలపై ఒత్తిడి పెట్టడం విడ్డూరం. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలలో ఆటస్థలం లేకుండా నడుపుతుంటే అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఆటలు లేకపోవడం వల్లే పిల్లలకు ప్రాథమిక స్థాయిలో కళ్ళ జోడు, హైస్కూల్ స్థాయిలో ఊబకాయం, కాలేజీస్థాయిలో అల్సర్లు వంటి వ్యాధులు వెంటాడు తున్నాయి. ప్రతిరోజూ అన్ని తరగతుల వారికీ ప్రాథమిక స్థాయి నుంచి నుంచి పీజీవరకు ఒక్కో పిరియడ్ క్రీడల కోసం కేటాయించాలి. డ్రిల్, క్రీడలకు కేటాయించిన పిరియడ్లు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మిగిలిపోయింది. చదువు కోవడం అంటే చదువు కొనడంలా మారింది మన విద్యావ్యవస్థ. నేడు మన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే వారికి బోధనేతర పనుల వల్ల వారి విలువైన సమయం దెబ్బతింటోంది. ఉపాధ్యాయుడు ఆహ్లాదకరంగా బోధన చేయగలిగితే విద్యాలయాలు ఆనంద నిలయాలు అవుతాయి. విద్యార్థులు భవిష్యత్ తరాలకు వెలుగవుతారు.

- నిడమర్రు

● తల్లిదండ్రులు బాధ్యతగా మెలగాలి



నేడు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. పిల్లలు విపరీతంగా సెల్ ఫోన్లలో గేమింగ్‌లకు, చాటింగ్‌లకు అలవాటు పడిపోయి డిజిటల్ ఎడిక్షన్‌కు లోనవుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు స్మార్ట్ ఫోన్‌లు ఇవ్వకూడదు. ఇచ్చినా ఓ కంట కనిపెడుతూ ఉండాలి. తల్లిదండ్రులు పిల్లలు జీవితాలు బంగారుమయం చేయాలి.

- లక్కదాసు ప్రసాదరావు, స్కూల్ అసిస్టెంట్, కొమ్మర గణపవరం మండలం

● కుటుంబ జీవితానికి పిల్లలు దూరం



చదువుల ఒత్తిడి వల్ల కుటుంబ జీవితానికి పిల్లలను దూరం చేస్తున్నాం. విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ఏ స్కూల్లోనూ సరైన మార్గదర్శకత్వం ఇవ్వలేకపోతున్నారు. ఆట పాటలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. హాస్టల్ జీవితం పిల్లలకు శాపంగా మారుతోంది. బంధాలు విలువలు లేకుండా పోతున్నాయి. పెళ్లిలకు, ఫంక్షన్‌లకు తీసుకు వెళ్లకపోవడంతో వారికి సామాజిక విలువల పట్ల అవగాహన ఉండడం లేదు.

-చల్లా లక్ష్మీ నారాయణ, అధ్యాపకుడు, పశ్చిమ గోదావరి జిల్లా విద్యా శిక్షణా సంస్థ, దూబచర్ల

● బలవంతపు చదువులు వద్దు



తల్లిదండ్రులు పిల్లల అభిరుచులను గమనించి దానికి తగిన విద్యను అందివ్వాలి. వారి ఆశలు, ఆకాంక్షలు పిల్లలపై రుద్దకూడదు. బలవంతపు చదువుల వల్ల ఒత్తిడికి గురవుతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రులు చక్కని ఆలోచనలతో ముందుకు వెళ్లాలి.

- బద్దా శ్రీనివాసరావు, విద్యా కమిటీ వైస్ చెర్మన్ ప్రాథమికోన్నత పాఠశాల, ముప్పర్తిపాడు

వీరి భవిష్యత్తుకు ఎవరు భరోసా ?

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలలు ఉత్తమ పౌరులుగా వెలుగొందాలని చాచా నెహ్రూ కలలు కన్నారు. మంచి విషయాలను బోధిస్తే వారు ఉత్తమ పౌరులుగా వెలుగొందుతారని చెప్పేవారు. అమ్మనాన్న ఉంటే పిల్లలను చూసుకుంటారు. అనాథలను ఎవరు చూస్తారు..అయ్యోపాపం అని జాలి పడతారే తప్ప వారి భవిష్యత్తు గురించి ఎవరూ ఆలోచించరు.. కానీ ఇలాంటి బాలలను చేరదీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఏలూరు శనివారపుపేటలో బాలుర వసతి గృహం ఏర్పాటు చేసింది. ఇక్కడ ఏడు జిల్లాలకు కలిపి జువైనల్ హోమ్ ఒక్కటే ఉంది. చట్టంతో విభేదించిన బాలలను పోలీసులు కోర్టుకు హాజరు పరిచిన తరువాత వారిని ఇక్కడే ప్రత్యేకంగా ఉంచి కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు తీసుకురావడానికి చర్యలు చేపడతారు. ఈ జువైనల్ హోమ్‌లో ప్రస్తుతం బుధవారం రాత్రి వరకూ ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ చదివే వారు మొత్తం 65 మంది ఉన్నారు. చట్టంతో విభేదించిన మరో 8 మంది బాలలు ఉన్నారు. గతేడాది జిల్లా విద్యాశాఖ నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వచ్చి విద్యాబోధన చేశారు. గతేడాది విద్యా సంవత్సరం ముగింపు ఏప్రిల్ 23న వారంతా తిరిగి తమ మాతృ పాఠశాలలకు వెళ్ళిపోయారు. ఈ ఏడాది జూన్ 12న తిరిగి పాఠశాలలు తెరిచినప్పటికీ జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయులను ఇవ్వలేదు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆ వసతి గృహాన్ని సందర్శించి వెంటనే ఉపాధ్యాయులను నియమిం చాలని లేఖ కూడా రాశారు. విద్యాశాఖ మాత్రం తమకు ఏమీ పట్ట నట్లుగా వ్యవహరించింది. రెండు నెలల క్రితం ఒక ఉపాధ్యాయు రాలిని పంపించారు.కౌన్సెలర్లు కూడా లేరు. 9 మంది విద్యార్థులు ప్రైవే టుగా పదో తరగతి పరీక్షలకు హాజరవ్వడానికి సిద్ధపడుతున్నారు. ఏమి చదవాలో, ఏమి రాయాలో ఎలా తెలుస్తుంది. అధికారులు ఈ నిర్లక్ష్యంతో బాలలు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..



ఈ విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులను పంపించలేదు. జిల్లా విద్యాశాఖాధికారికి లేఖలు రాశాం. ఇంతవరకూ ఎవరినీ పంపించలేదు. ప్రస్తుతం విద్యార్థులకు ఇక్కడ ఉన్న ఆఫీస్ స్టాఫ్ కొన్ని సబ్జెక్టులు చెప్తున్నారు. నేను తెలుగు, హిందీ, సోషల్, ఇంగ్లీషు సబ్జెక్టులను సమయాన్ని బట్టి చెప్తున్నాను.

-శ్రీవల్లి, వసతి గృహ పర్యవేక్షకురాలు




జలవిహారానికి బయలుదేరిన స్వామి, అమ్మవార్లు

సుదర్శన పుష్కరిణిలో.. శ్రీవారి విహారం

కనువిందు చేసిన చినవెంకన్న తెప్పోత్సవం

ద్వారకాతిరుమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుదర్శన పుష్క రిణిలో హంస వాహనాన్ని అధిరోహించిన చినవెంకన్న ఉభయ నాంచారులతో కలసి బుధవారం రాత్రి జల విహారం చేశారు. క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని జరిగిన ఈ తెప్పోత్సవం భక్తులకు నేత్ర పర్వమైంది. కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలు, అర్చకుల వేదఘోషల నడుమ జరిగిన ఈ ఉత్సవం చూపరులకు కనువిందు చేసింది. ఆలయంలో విశేషంగా అలంక రించిన తొళక్కవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, సన్నాయి డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. తిరువీధి సేవ అనంతరం వాహనాన్ని సుదర్శన పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. దేదీప్యమానంగా వెలుగొందుతున్న పుష్కరిణిలో హంసవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో సత్యనారాయణమూర్తి స్వామి,అమ్మవార్లకు పూజలు చేశారు. పుష్కరిణి మధ్యనున్న మండపంలో శ్రీవారు. పద్మావతి, అండాళ్ అమ్మవార్లను ఉంచి అర్చకులు పూజలు జరిపారు.



టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న తహసీల్దార్ దుర్గాకిషోర్

పాలకొల్లులో సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కళాకా రులకే కాదు క్రీడాకారులకు పుట్టినిల్లుగా నిలిచి ఉంటుందని నరసా పురం ఆర్డీవో దాసిరాజు అన్నారు. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెరుకూరి బుద్ధావతారం రాజు మెమోరియల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. టోర్నమెంట్ చైర్మన్ భగవాన్ రాజు మాట్లాడుతూ తమ సంస్థ నెలకొల్పి 25 ఏళ్ళు అయ్యిందని ఎంతోమంది టెన్నిస్ క్రీడా కారులకు శిక్షణ ఇచ్చిన ఘనత బుద్ధావతారం రాజుకు దక్కుతుందన్నారు. బుద్ధావతారం రాజు కుమారులు టోర్నమెంట్ నిర్వహణకు రూ5 లక్షలు ఇచ్చారన్నారు. టోర్నమెంట్ కార్యదర్శి రాంబాబు, వెంకటేష్ వర్మ, తహసీల్దార్ దుర్గా కిషోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొట్టుముక్కల సూర్యనారాయణరాజు సత్యనారాయణ రాజు, గోపాలకృష్ణంరాజు, సూరిబాబు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరై..

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పాలకోడేరు మండలం కుముదవల్లిలో ఉన్న గ్రంథాలయాన్ని గ్రామస్థులు ఒక గుడిలా చూసుకుంటారు. అందరికీ దేవాలయమైన ఈ గ్రంథాలయానికి ఇప్పటికి 128 సవంత్స రాలు..స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరి పోసిన ఈ గ్రంథాలయ చరిత్ర తెలుసుకుంటే ఎంతోమందికి స్ఫూర్తి కలిగించకమానదు..

చైతన్యం నింపిన కుముదవల్లి గ్రంథాలయం

128 ఏళ్లుగా విరాజిల్లుతున్న విజ్ఞాన గని

గ్రంథాలయ అభివృద్ధికి దీపావళి చందాలు.. పెళ్లి కానుకలు

కుముదవల్లిలోని మధ్యతరగతి రైతుకుటుంబానికి చెందిన తిరుపతి రాజుకు పుస్తక పఠనం అంటే ప్రాణం. దానికి కారణం.. ఆ ఊరికే చెందిన పర్రంగి చిన్నమారాజు. అప్పట్లో ఆయన తన దగ్గరున్న 50 పుస్తకాలను తిరుపతిరాజు తండ్రి లచ్చిరాజుకిచ్చి లైబ్రరీ ఏర్పాటుకు సాయపడ్డారు. తిరుపతిరాజులో పఠనాసక్తిని కలిగించింది ఆ గ్రంథాలయమే. అందులో పుస్తకాలు చదవడం వల్లే స్వాతంత్ర్య పోరాటం గురించి తెలిసింది. తాను చదివిన విషయాలన్నీ తన ఊళ్లోని వాళ్లకూ తెలియాలని వారూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొనాలని ఆశించారు. ఆ చైతన్యం తన ఊరి ప్రజల్లో రావాలంటే తన తండ్రి ఏర్పాటు చేసిన ఆ చిన్న లైబ్రరీని అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. అలా 1887 నవంబరు 28న ఆ ఊళ్లో చిన్న గుడిసె వేసి కందుకూరి వీరేశలింగం కవి సమాజ గ్రంథాలయం ప్రారంభించారు. పుస్తకాలు, గ్రంథాలు, పత్రికలు కొనుగోలు చేయడానికి తిరుపతిరాజు తనకున్న ఎకరం భూమిని విరాళంగా ఇచ్చేశారు. ఈ గ్రంథాలయాన్ని అప్పట్లో స్వయంగా సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులే ప్రారంభించారు. తిరుపతి రాజు కోరుకున్నట్టే స్థానికులు స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన సమాచారాన్ని గ్రంథాల యానికి వచ్చే పత్రికల్లో చదివి స్ఫూర్తి పొందారు. ఆ గ్రామం నుంచి దాదాపు 24 మంది స్వాతంత్ర్య పోరా టంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అలా ఆ గ్రంథాలయం దేశస్వాతంత్ర్య ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించింది. 1884లో గ్రంథాల యోద్యమానికి పట్టుగొమ్మగా నిలిచింది కుముదవల్లి. ఈ లైబ్రరీ గురించి విదేశంలింగం పంతులు స్వదస్తూరీతో ఇక్కడి మినిట్స్‌బుక్‌లో రాసి చేసిన సంతకం ఇప్పటికీ మినిట్స్ బుక్‌లో ఉంది..రూథర్‌ఫర్డ్ అభిప్రాయం కూడా ఉంది.

మహామహులు సందర్శించారు..

హూరిపాకలో ప్రారంభమైన గ్రంథాలయం కాల క్రమంలో పెంకుటిళ్ళుగా తరువాత దాతల సహకారంతో పెద్ద భవనంగా తీర్చిదిద్దారు. డాక్టర్ పద్మభూషణ్ బివి రాజుతో, లార్సన్ సిమ్మెంట్ గ్రూప్ ఆఫ్ కంపెనీ నేత సాయి కృష్ణంరాజు మరి కొంత మంది దాతల సహకారం, గ్రామస్తులు చేయుతతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేశారు. ఈ గ్రంథాలయంలో సుమారు 17 వేల పుస్తకాలు ఉన్నాయి. ఇందులో ఎందరో మహామహులు రచించిన గ్రంథాలు, ప్రముఖుల చేతిరాత ప్రతులు వంటి అమూ ల్యమైన అక్షర సంపద ఉంది. కోస్తా జిల్లాలోని విద్యార్థులు తెలుగుభాష, చరిత్రపై పీహెచ్‌డీ చేసేం దుకు ఈ గ్రంథాలయం ఎంతో దోహదపడుతోంది. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణ, అయ్యంకి వెంకటరమణయ్య, చిలకమర్తి లక్ష్మీనరసింహం, దుగ్గరాల బల రామ కృష్ణయ్య, అడివి బాపిరాజు, జంధ్యాల పాపయ్యశాస్త్రి, డాక్టరు సి.నారాయణ రెడ్డి, నండూరి కృష్ణ మాచార్యులు వంటి పెద్దలు ఈ గ్రంథాలయానికి వస్తూ పోతూండే వారట. గ్రంథా లయ అభివృద్ధికి గ్రామస్థులు ఓ సంప్రదాయం పాటిస్తు న్నారు. గ్రామంలో ఎవరి పెళ్లి జరిగినా ఎంతోకొంత సొమ్మును లైబ్రరీకి విరాళంగా ఇచ్చేవారు. అది ఇప్పటికీ కొనసాగటం విశేషం. ప్రస్తుతం ఈ గ్రంథాలయానికి లైబ్రే రియన్‌గా పెనుమత్స సూర్యసుగుణ పనిచేస్తున్నారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా లైబ్రరీలోని పుస్తకాల కంప్యూటరీకరణ చేసే ప్రక్రియ ప్రారంభమైంది.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పలు దేశాలు నిర్వహిస్తున్నాయి. భారత దేశంలో ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ (ఐఎల్ఏ) 1968 నుంచి ప్రారంభించింది. ప్రతీ ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు దేశమంతటా నిర్వహిస్తు న్నారు. లైబ్రరీ ప్రాముఖ్యత, ప్రయోజనాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో గురువారం నుంచి వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.







రూథర్‌ఫర్డ్ రాసిన అభిప్రాయం.. ఆనాటి విజిటర్స్ బుక్

● మరింత అభివృద్ధి చేస్తాం



కుముదవల్లి గ్రామంలో ఉన్న గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. అందరూ మెచ్చేలా తీర్చుది ద్దుతాం. ఇప్పటికే గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను డిజిలైటేజేషన్ చేస్తున్నాం. రానున్న రోజుల్లో ప్రతీ విద్యార్థికి కావలసిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతాం.

నాగేంద్ర వర్మ, కార్యదర్శి

● ఎంతోమందికి దారి చూపింది



ఈ గ్రంథాలయం ఎంతో మందికి భవిష్యత్తుకు బాటలు వేసింది. గ్రామంలో ప్రతీఒక్కరికీ ఇది దేవాలయం లాంటిది. ఈ గ్రంథాలయంలోకి వస్తే ఎంతో ప్రశాంతత ఉంటుంది.

- సాగి మధుసూదనరాజు, గ్రామస్తుడు

విజ్ఞానమే కాదు.. వైద్యం కూడా

ఈ గ్రంథాలయంలో విజ్ఞానాన్ని అందించటంతో పాటు ఉచితంగా ఆయుర్వేద మందులను కూడా అందిస్తారు. చాలా కాలం నుంచి పలు రోగాలకు ఇక్కడ మందులు అందిస్తున్నారు. గ్రూప్-1, గ్రూప్-2, సివిల్, ఇతర కాంపిటే టివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం దాతల సహకారంతో అవసరమైన పుస్త కాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటు న్నారు.

- పాలకోడేరు

ఇక్కడే భవిష్యత్తుకు బాటలు



ఆకివీడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు శాఖా గ్ర ంథా లయంలో 38 ఏళ్ళగా విద్యార్థులు విజ్ఞానాన్ని ఆస్వాదిస్తున్నారు. మాదివాడలో 1986లో గ్రంథాలయం ప్రారంభమైంది. ఈ గ్రంథాలయంలో అనేక మంది విద్యార్థులు చదువుకుని నేడు ఉన్నత స్థితిలో ఉన్నారు. ఏలూరు జిల్లా ఆలపాడుకు చెందిన ఐఏఎస్ అధికారి మద్దిరాల నాగరాజు ఆర్థికసేవల విభాగం కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 40 మందికి పైబడి ఉపాధ్యాయులు పోటీ పరీక్షలకు ఇక్కడ నుంచే ప్రిపేర్ అయ్యారు..

జీవితానికి స్ఫూర్తినిచ్చింది



1990లో డిగ్రీ పూర్తయింది. అజ్జమూరు నుంచి సైకిల్‌పై ఆకివీడు గ్రంథాలయానికి వెళ్ళి చదువుకొనేవాళ్ళం. ఇక్కడే ఎక్కువ సమయం గడిపేవాళ్లం.. చదువుకున్న వాళ్ళు ఆ రోజుల్లో ఎక్కువగా వచ్చేవారు. వచ్చిన వారందరూ నాకు పలానా ఉద్యోగం వచ్చిందని చెప్పేవారు.. దానిని మేము స్ఫూర్తిగా తీసుకొనేవాళ్ళం. పోటీ పరీక్షలకు పుస్తకాలు బాగా ఉపయోగపడేవి. 1991 జూలైలో పోలీస్‌శాఖలో ఉద్యోగం వచ్చింది. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట పోస్టు ఇచ్చారు. ఇప్పుడు ఏలూరులో విజి లెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్నాను.

-శింగలూరి వెంకటేశ్వరరావు,విజిలెన్స్ డీఎస్పీ, ఏలూరు

ఉద్యోగం రావడానికి గ్రంథాలయమే కారణం



డిగ్రీ పూర్తయిన తరువాత ఖాళీగా ఉండకుండా అజ్జమూ రు నుంచి సైకిల్‌పై ఆకివీడు గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకా లను చదవడం మొదలు పెట్టాం. ఉద్యోగం రావడానికి గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడింది. పోటీ పరీక్షలకు సంబంధించి అనేక విషయాలు అక్కడకు వచ్చి వెళ్లే ఉద్యోగులు చెబుతుండే వారు. వారి సూచనలు మాకు బాగా ఉపయోగపడేవి.. ఇప్పుడు నేను ఉన్నత స్థితిలో ఉన్నానంటే ఎక్కువ సమయం గ్రంథాలయంలో గడపడమే..

- కోయ మల్లిఖార్జునరావు, ఎక్సైజ్ సీఐ, పలాస

నిరుద్యోగులకు దేవాలయాలు



డిగ్రీ చదువుకొన్న తరువాత ఖాళీగా ఉండకుండా కుప్పనపూడి నుంచి సైకిల్‌పై గ్రంథాలయానికి వచ్చేవాడిని. ఎక్కువ సమయం ఇక్కడే గడిపేవాడిని. ఉద్యోగం సంపాదించుకోవడానికి కావాల్సిన పుస్తకాలు ఉండేవి. చదువుకోవడా నికి పుస్తకాలు కావాలంటే అవసరమైన పుస్తకాలు తీసు కొచ్చి అందించేవారు అప్పటి గ్రంథాలయ అధికారులు.. అందుకే గ్రంథాలయాలు నిరుద్యోగులకు దేవాలయాలు వంటివి..

- నూకల మురళీ గంగాధరరావు, ఎంపీడీవో, పాలకోడేరు

చేదు పుట్టిస్తున్న తియ్యని వ్యాధి



మధుమేహంలో మనమే ప్రథమం

డయాబెటిస్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్ అని భారత్‌ను పిలవడం మనం సంతోషించదగ్గ విషయం ఎంత మాత్రం కానే కాదు. ప్రగతిలో ముందు ఉన్నామంటే ఆనందదాయకం. పౌరులలో ఒక దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్య విషయంలో ప్రపంచంలోనే మనం ప్రథమంగా ఉన్నామని గుర్తించబడడం విచారించాల్సిన విషయం. ప్రపంచంలో మొత్తం మధుమేహ బాధితులలో 17 శాతం మన దేశంలో ఉండడం గమనార్హం. ప్రతీ పది మంది వయోజనులలో ఒకరికి మధుమేహం ఉంది. ఇప్పుడు దేశంలో దాదాపు 80 మిలియన్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. 2045 నాటికి ఈ సంఖ్య 140 మిలియన్లకు చేరవచ్చని అంచనా. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మధుమేహంతో బాధపడేవారి సంఖ్య పలు గణాంకాల ప్రకారం ఆరు లక్షలు ఉండవచ్చని అంచనా. మధుమేహ వ్యాధి నియంత్రణ కోసం కృత్రిమ ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఫ్రెడరిక్ బాంటింగ్ జయంతి పురస్కరించుకుని నవంబరు 14వ తేదీని ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

పాలకొల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

చక్కెర వ్యాధి, లేదా డయాబెటిక్, లేదా మధుమేహం ఏ పేరుతో పిలిచినా వాటి బారిన పడిన పౌరులు ఔషధాల జోలికి పోకుండానే తమ జీవన శైలిని మార్చుకోవడం ద్వారా 80 శాతం మందిలో సమస్యను నియంత్రించవచ్చని వైద్యవర్గాలు చెబుతున్నాయి. మధుమేహం సమస్య మానవ శరీరంలో ఇన్సులెన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రయత మితబాలిజం మధుమేహంతో బాధపడేవారిలో ప్రధానంగా అతిమూత్రం. అతిదాహం. చూపు తగ్గడం ఆకస్మికంగా బరువు తగ్గడం, మూత్రపిండాల వైఫల్యం, ఆకస్మిక గుండెపోటు, పక్షవాతం వంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి.

ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపుల ద్వారా పశ్చిమ గోదావరి జిల్లాలో చక్కెర వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 21,847గా ఉంది బీపీ, చక్కెర వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 62,036గా ఉంది. ఏలూరు జిల్లాలో 23,460 మంది ఉండగా చక్కెర, బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య 74,162గా ఉంది. ఫ్యామిలీ ఫిజిషియన్

- డయోబెటిస్ క్యాపిటల్‌గా 'భారత్'
- ప్రతీ పది మందిలో ఒకరికి..
- 2045 నాటికి 140 మిలియన్లకు చేరవచ్చని అంచనా.
- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆరు లక్షల మందికి మధుమేహం

క్యాంపుల ద్వారా ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సుమారు 30 శాతం పౌరులలో 1లక్షా 80వేల మందికి వ్యాధి ఉందని గుర్తించగా అదే నిష్పత్తిలో మిగిలిన పౌరులలో మరో నాలుగు లక్షల పైబడి చక్కెర వ్యాధి ఉండే అవకాశాలు ఉన్నాయని సంబంధిత శాఖలో నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే మొత్తం ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆరు లక్షలు పైబడిన పౌరులలో మధుమేహం సమస్య ఉంది. దేశంలోని వయోజనులలో 7.7 కోట్లు మందికి మధుమేహం

నేడు మధుమేహ దినోత్సవం



ఉందని గుర్తించారు. ఉమ్మడి జిల్లా విషయానికి వస్తే ప్రతీ పది మందిలో ఒకరికి డయాబెటిస్ ఉన్నట్టు తెలుస్తుంది.

చిరుప్రాయంలోనే మధుమేహం

అత్యంత దురదృష్టకరమైన విషయం చిరు ప్రాయంలోనూ మధుమేహం రావడం. మారుతున్న జీవనశైలి శరీరానికి తగినంత వ్యాయామం లేకపోవడం. ఊబకాయం, తల్లి దండ్రుల ద్వారా వంశపార్యంపరంగానూ పసిపిల్లలు సైతం ఈ వ్యాధి బారిన పడుతు న్నారు.

యువతలో పది శాతం

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్మార్) నివేదిక ప్రకారం మన జనాభాలో ముఖ్యంగా యువతలో గత కంటే ఇప్పుడు పది శాతం మధుమేహం పెరుగుదల కనిపిస్తుంది.



మారుతున్న జీవనశైలితోనే ఇబ్బందులు

పిల్లల్లో సైతం పెరుగుతూ రావడం ఆందోళన కల్గిసుందని ఐసీఎమ్ఆర్ నివేదికలో పేర్కొంది.

మధ్య వయస్సు వారికి తీవ్రం..

ముఖ్యంగా మధ్య వయస్సు వారికి మధుమేహం సమస్య తీవ్రమైంది. అధిక కేలరీల గల ఆహారం తీసుకోవడం, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, ఆందోళనలే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అధికంగా మద్యపానం చేసే వారిలోనూ ధూమపానం చేసే వారిలోనూ వేగంగా ఈవ్యాధి పెరుగుతుంది. వీటికి తోడు కుటుంబ చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) సైతం మధుమేహాన్ని కలుగజేస్తుంది.

డబ్ల్యూహెచ్‌వో స్పందన

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మధుమేహంపై స్పందనను వేగవంతం చేసింది. 2021 ఏప్రిల్‌లో డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ డయాబెటిస్ కాంపాక్ ప్రారంభించింది. నవంబరు 14వ తేదీన ప్రపంచ మధుమేహం వ్యాధి దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

నియంత్రణ సాధ్యమే..

క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల్య ఆహారం, ఆకు కూరలు అధికంగా తీసుకోవడం, పిండి పిండి పదార్థాలు లేని కాయగూరలు వినియోగం, తృణధాన్యాలు, బ్రౌన్ రైస్, పరిమిత ఆహారం తీసుకోవడం ద్వారా అదుపులో పెట్టవచ్చు మానసిక ప్రశాంతత, యోగా మధుమేహాన్ని దూరం పెడతాయి. ఇది వ్యాధిగా చూడాల్సిన అవసరం లేదని అది దీర్ఘకాలిక సమస్య అని జీవన శైలి ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చని వైద్యవర్గాలు చెబుతున్నాయి. మధుమేహ వ్యాది సమస్య బారిన పడినవారిలో 50 శాతం మందికి మాత్రమే చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోగల్గుతున్నారు. ఈఅంశంపై వైద్యవర్గాలు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఇన్సులెన్ ఇంజక్షన్‌లకు చెక్

సెల్‌ట్రాన్స్‌పాంటేషన్‌తో మధుమేహ బాధితులకు స్వాంతన కల్గించవచ్చని ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన ఓ సదస్సులో పలువురు వైద్యప్రముఖులు ప్రకటించడం పట్ల మధుమేహ సమస్యతో బాధపడుతున్న వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మితంగా ఆహారం తీసుకుంటా

నాకు ఐదేళ్లగా డయాబెటిస్ ఉంది. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం వేళల్లో వైద్యుల సూచనల మేరకు మాత్రలు వేసుకుంటూ మితంగా ఆహారం తీసుకుంటా.. వీలైనంత వరకు శారీరక శ్రమ ఉండేలా చూస్తా.. దుంప కూరలు తినకుండా ఎక్కువగా ఆకుకూరలు తింటూ డయాబెటిస్ అదుపులో ఉండేలా చూస్తాను.

- ఎన్. సుబ్బారావు
నాలుగో డివిజన్, ఏలూరు.

అసెంబ్లీ వాయిస్

ఎర్ర కాల్వ ఆధునికీకరణ పనులపై దృష్టి పెడతాం : మంత్రి నిమ్మల



జంగారెడ్డిగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎర్ర కాల్వ ఆధునికీకరణ పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం అసెంబ్లీలో సభ్యులు ఎర్రకాలువ ఆధునీకరణ పనులపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధాన మిచ్చారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆరు వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగి ఉన్న ఎర్రకాలువను 20,250 క్యూసెక్కులకు పెంచుతూ రూ.143 కోట్లు కేటాయించి ఆధునీకరణ పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. 2014 నుంచి 2019 వరకు రూ.52 కోట్ల పనులు చేశామన్నారు. 2019 వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎర్ర కాల్వకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఈ ఏడాది జూలైలో వచ్చిన వరదలకు 98 ప్రాంతాల్లో ఎర్ర కాల్వకు గండ్లు పడ్డాయన్నారు. ప్రస్తుతం నిధులు సమస్య ఉన్నాప్పటికీ ఆధునీకరణ పనులు చేపడతామన్నారు.

ఎర్ర కాల్వ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి : బొలిశెట్టి



తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్ర కాలువ ముంపు ప్రమాదం నుంచి రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని అమరావతిలోని అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆయన ఎర్రకాలువ సమస్యలపై ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రస్తావించారు. ఎర్రకాలువ ముంపు వల్ల తాడేపల్లిగూడెం, తణుకు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని కొన్ని వేల ఎకరాల పంట నష్టపోతుందని, బుడమేరు తరహాలో ఎర్రకాలువ ముంపు కోసం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం 2019-24 వరకు పడిన గండ్లు వదిలేశారని రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. రూ.50కోట్ల మేర నిధులు విడుల చేస్తే పరిష్కారం చూపించవచ్చన్నారు. గత ఆగస్టులో వచ్చిన వరదలో పంట నష్టపరిహారం అందించాల్సి ఉందని రైతులకు రూ.25 కోట్లు ఇవ్వాలని వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని కోరారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం దిశగా కూటమి బడ్జెట్ : ఆరిమిల్లి



ఇరగవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పునర్నిర్మాణం, ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అసెంబ్లీ సమావేశాలలో బుధవారం బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్ల నిర్మాణం, వ్యవసాయానికి, రైతులకు కేటాయింపులు, వ్యవసాయ యాంత్రికరణ, పెన్షన్లు, విద్యుత్తు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేశారన్నారు. యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విద్యుత్తు, యువత, పోలీస్, క్రీడలు, పర్యాటక రంగం, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఇతర రంగాలకు చేసిన కేటాయింపులపై మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అభినందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని జరిగిన విధ్వంసం, హద్దులు లేని అవినీతి, రోడ్లు దుస్థితి, పారిశ్రామిక తిరోగమనం, విచ్చలవిడి అప్పులు, ఆరోగ్య శ్రీ బాకీలు తదితర అంశాలలో లోపాలను ఎత్తిచూపుతూ ఖండించారు.

తొమ్మిది కోర్టుల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఈనెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

భీమవరం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా కోర్టు పరిధిలోని తొమ్మిది కోర్టులలో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టుల భర్తీకి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సి. పురుషోత్తమకుమార్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు కోర్టులో ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, ఏలూరు కోర్టులో సెకండ్ సోషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, కొవ్వూరు ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, కొవ్వూరు సెకండ్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, తణుకు కోర్టులో ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, తాడేపల్లిగూడెం కోర్టులో సెకండ్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, నరసాపురం కోర్టులో సెకండ్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, పాలకొల్లు కోర్టులో సెకండ్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టు, జంగారెడ్డిగూడెం కోర్టులో సెకండ్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్-1 పోస్టును భర్తీ చేసేందుకు నవంబరు 25వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. నిర్దిష్ట విధానంతో కూడిన దరఖాస్తులను పూర్తి చేసి, సంబంధిత నకళ్లను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించాలని, పాస్‌పోర్టు సైజు ఫొటోలను మూడు సెట్లలో సమర్పించాలని పేర్కొన్నారు. సంబంధిత పూర్తి వివరాలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ కోర్టు నోటీసు బోర్డులోను, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ కోర్టు వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని సెకండ్ క్లాను ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుల్లో, బార్ అసోసియేషన్ నోటీసు బోర్డుల్లో నోటిఫికేషన్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం 5గంటలు సమయం దాటిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబడవన్నారు.

'ఉమ్మడి పశ్చిమ'లో కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

తాడేపల్లిగూడెం అర్బన్/ఉంగుటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లాకు నాలుగు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు దక్కాయి. రజిక కార్పొరేషన్ డైరెక్టర్లుగా భీమవ రం నుంచి ఉప్పులూరి చంద్రశేఖర్, తణుకు నుంచి పల్లపురావు, తాడేపల్లిగూడెం నుంచి తాటపూడి గణేష్ నియమితులయ్యారు. గవర కార్పొరేషన్‌లో తణుకు పట్టణానికి చెందిన పలమరశెట్టి నాగేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు చింతల శ్రీనివాస్‌ను కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నామినేట్ చేసింది. మొత్తం 15 మంది సభ్యులతో కూడిన కార్పొరేషన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి చింతల శ్రీనివాస్ ఒక్కరికే అవకాశం లభించింది.

ఈ పదవిపై ఆయన మాట్లాడుతూ ఈ డైరెక్టర్ పదవి తనకు అవసరం లేదని కినుక వహించారు. తాను రాష్ట్ర చైర్మన్ పదవిని ఆశించానని తెలిపారు.

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ వ్యాపారస్తుడు మృతి

ఉండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యాపారస్తుడు గుంటూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఉండి ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. యలమంచిలి మండలం అడవిపాలెంకు చెందిన సలాది గోపాలకృష్ణ (41) ఈనెల 9వ తేదీన అడవిపాలెం నుంచి విజయవాడకు మోటారు బైక్‌పై వ్యాపారం నిమిత్తం వెళ్లి తిరిగి విజయవాడ నుంచి గణపవరం మీదుగా ఉండి వస్తుండగా రాత్రి సమయంలో ఉండి గ్రామం శివారున బైక్ నుంచి కిందకు పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని భీమవరంలోని ప్రభుత్వాసుపత్రికి, అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు వున్నారు. మృతుడి సోదరుడు సలాది వెంకటసత్యఉదయ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జూట్ మిల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఈనెల 9వ తేదీన రైలు పట్టాలపై మృతి చెందిన వృద్ధుడిని బంధువులు గుర్తించారు. ఏలూరు పత్తేబాదకు చెందిన దర్బాశివయ్య (62) చిన్నతనం నుంచి అమాయకంగా ఉండేవాడు. వివాహం కాలేదు. తన సోదరుడు యోగక్షేమాలు చూసుకునేవాడు. ఈనెల 9వ తేదీన ఏలూరు జ్యూట్‌మిల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీ కొంది. ఈ సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ తన సిబ్బందితో వెళ్ళి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలిం చారు. ఈ సమాచారం దినపత్రికల్లో రావడంతో బంధువులు బుధవారం ఏలూరు ప్రభుత్వా సుపత్రికి వచ్చి మృతుడిని గుర్తించారు. రైల్వే పోలీసులు శవపంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు.

యువకుడి మృతదేహం గుర్తింపు

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఈనెల 11వ తేదీ రాత్రి రైలు పట్టాలు దాటుతున్న ఓ యువకుడిని రైలు ఢీ కొనడంతో మృతి చెందాడు. మృతుడిని బంధువులు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం అంబకండి గ్రామానికి చెందిన దూబసాయి(20) ఏలూరు సమీపంలోని వట్లూరులో ఉన్న సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 11వ తేదీ రాత్రి ఫోన్ మాట్లాడుతూ రైలు పట్టాలు దాటుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని బంధువులు గుర్తించడంతో ఏలూరు రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ అక్కడకు వెళ్ళి శవపంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కట్నం వేధింపుల కేసులో.. కానిస్టేబుల్‌తో సహా తల్లిదండ్రులకు జైలు

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం తీసుకురావాలని ఏఆర్ కానిస్టేబుల్ తన భార్యను వేధించాడు. అతడితో పాటు తల్లిదండ్రులు వేధించినట్టు నేరం రుజువు కావడంతో ఆ ముగ్గురికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఏడు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని మహిళా కోర్టు జిల్లా సెషన్స్ జడ్జి జి.రాజేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట చినపేట కొత్తకాలనీకి చెందిన కంబత్తుల రత్నరాజు కుమార్తె చైతన్యకు పెనుగొండ మండలం చినమల్లంకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చోడగిరి మహేంద్రకుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో అతడు, తల్లిదండ్రులు రూ.10 లక్షలు డిమాండ్ చేయగా చైతన్య తండ్రి ఏడు లక్షల రూపాయలు, ఒక మోటారు సైకిల్‌ను కట్న కానుకలను ఇచ్చారు. సారెగా మరో రెండు లక్షల రూపాయల సామగ్రి సమకూర్చారు. వీరికి ఒక కుమారుడు జన్మించాడు. మరో ఐదు లక్షల రూపాయలు అదనంగా తీసుకురావాలని కానిస్టేబుల్‌తో పాటు అతడి తల్లిదండ్రులు వేధింపులకు గురిచేశారు. ఈమేరకు ఆమె ఆచంట పోలీస్ స్టేషన్‌లో 2020లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఏలూరులోని మహిళా కోర్టులో విచారణ సాగింది. ఏఆర్ కానిస్టేబుల్ చోడగిరి మహేంద్రకుమార్ అతడి తండ్రి శామ్యూల్, తల్లి మరియమ్మలపై నేరం రుజువుకావడంతో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఏడు లక్షల రూపాయల జరిమానా విధించారు. జరిమానా సొమ్మును బాధితురాలికి పారితోషికంగా ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో యువకుడి వీరంగం.. కేసు నమోదు

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఓ యువకుడు పోలీస్ స్టేషన్ సిబ్బందిని బెదిరించడమే కాకుండా బ్లేడుతో శరీరం కోసుకుని వీరంగం చేశాడు. మంగళవారం రాత్రి వూటుకూరుకు చెందిన పోసిన సురేష్ అనే యువకుడు అర్ధనగ్నంగా స్టేషన్‌కు వచ్చి ఇటీవల తన తండ్రి బాల కోటయ్య చావుకు కారణం పోలీసులే అని, హంతకులు జైలు నుంచి బెయిలుపై బయటకు రావడానికి కారణం కూడా పోలీసులే అంటూ వీరంగం చేశాడు. అతడిని ఆపేందుకు స్టేషన్‌లో ఉన్న సిబ్బంది ఎవరూ ముందుకు రాలేకపోయారు. కొద్దిసేపటి తరువాత కానిస్టేబుళ్లు ధైర్యం చేసి ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. సిబ్బందిని, స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినందుకు పలు సెక్షన్ల కింద ఏఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

చోరీ సొత్తు స్వాధీనం



చోరీ సొత్తు ప్రదర్శిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

పెదవేగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తలుపులు పగులగొట్టి బంగారు, వెండి వస్తువుల ను అపహరించిన వక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు, వెండి వస్తువులను స్వాధీ నం చేసుకున్నామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. రామశింగవరం గ్రామానికి చెందిన నల్లగోపు అంబిక ఇంటిలో ఈ ఏడాది జూన్ 8వ తేదీ రాత్రి దొంగతనం జరిగింది. తలుపులు పగుల గొట్టి, బీరువాలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దొంగిలించారు. ఈ కేసులో విజయవాడకు చెందిన కుంభ గోపీకృష్ణ, భట్టిపల్లి సూర్యప్రకాష్, నాగవరప్పాడుకు చెందిన వేముల అజయ్‌బాబులను నిందితులుగా గుర్తించి, నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో, పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో న్యాయంపల్లి సమీపంలో నిందితులను గుర్తించి, అరెస్టు చేసి, వారివద్ద నుంచి 4.75 కాసుల బంగారు ఆభరణాలు, 134 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చామని ఎస్‌ఐ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

దెందులూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన దెందులూరు మండలం సత్యనారాయణపురం సమీపంలో జరిగింది. బుధవారం గ్రామ సమీపంలో టైర్ పంక్షర్ అయి నిలిపిన ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు ఘన స్థలానికి చేరుకుని వైద్యం నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించినట్టు వైద్యులు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎదురుదెరుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాయలం గ్రామానికి చెందిన చల్లా రామప్రసాద్, కేదారశెట్టి గణేష్ మంగళవారం రాత్రి భీమవరంలో పని ముగించుకుని ఇంటికి వెళుతున్నారు. రాయలం రోడ్డులో రాత్రి 11 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో రామప్రసాద్, గణేష్‌లకు తీవ్ర గాయాలు కాగా స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రహమాన్ తెలిపారు.

జ్యూయలరీ షాపులో జీఎస్టీ అధికారుల తనిఖీలు

నరసాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణంలోని కోర్టు వీధిలో ఉన్న ఓ జ్యూయలరీ షాపులో బుధవారం జీఎస్టీ అధికారులు తనిఖీలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ పరివేక్షణలో నలుగురు అధికారులు షాపులో పలు రికార్డులను పరిశీలించారు. ఆ సమయంలో దుకాణంలో ఉన్న కస్టమర్లను బయటకు పంపించారు. సాధారణంగా జ్యూయలరీ షాపుల్లో ఐటీ అధికారులు సోదాలు చేయడం సర్వసాధారణం. అయితే జీఎస్టీ అధికారులు రావడం బులియన్ మార్కెట్‌లో చర్చనీయాంశమైంది. దీనిపై జీఎస్టీ అధికారులు మాత్రం నోరు మెదపలేదు, సాధారణ తనిఖీలంటూ దాటవేశారు.

ఎస్టీపీ రాష్ట్ర సహ అధ్యక్షుడిగా స్టీవెన్ ఏకగ్రీవం

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్టీఏ) రాష్ట్ర సహ అధ్యక్షుడిగా జీ.జే.ఏ.స్టీవెన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక అమరావతిలో ఈనెల 12న జరిగింది. ఏలూరు రూరల్ మండలం వైఎస్సార్ కాలనీ ఎంపీపీఎస్ స్కూలులో స్టీవెన్ ఎస్టీటీగా పనిచేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ టీచర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే ప్రయత్నం చేయడంతోపాటు, దాతలను పాఠశాలకు రప్పించి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. త్వరలోనే సంఘ జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేసి విస్తరిస్తామని వివరించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

వేర్వేరు చోట్ల 25 మంది జూదరుల అరెస్ట్

ఆకివీడు/అత్తిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):వేర్వేరు చోట్ల పేకాటాడుతున్న మొత్తం 25 మంది పోలీసులు అరెస్ట్ చేశారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలో పేకాటాడుతున్న పదమూడు మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.71,600, ఏడు సెల్‌పోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేశామని, దుంపగడప గ్రామంలో పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రూ.14,790 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ హనుమంతు నాగరాజు తెలిపారు. అత్తిలి మండలం, మంచిలి శివారు కాల్వ పక్కన పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశామని అత్తిలి ఎస్‌ఐ ప్రేమరాజు బుధవారం తెలిపారు. వారి నుంచి 11,090 నగదు, 52 పేక ముక్కలను, మూడు సెల్‌ఫోన్లు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడి అరెస్ట్

టి.నరసాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రేమపేరుతో పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ ఎం.జయబాబు బుధవారం తెలిపారు. మండలంలో ఓ గ్రామానికి చెందిన యువతిని.. వెలగపాడుకు చెందిన బొడ్డు వంశీ ప్రేమ పేరుతో నమ్మించి మోస గించాడని యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అనంతరం యువకుడిని అరెస్ట్ చేసి చింతలపూడి కోర్టులో హాజరు పరిచామన్నారు

జగన్నాథపురంలో ఉద్రిక్తత

- షాపింగ్ కాంప్లెక్స్ అక్రమ నిర్మాణంపై గ్రామ నాయకుల ముట్టడి
- ఆక్రమణలు కూల్చాలని పంచాయతీ సమావేశంలో తీర్మానం

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో మంగళవారం రాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని జిల్లా పరిషత్ భూముల్లో అక్రమంగా ఓ వ్యక్తి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడని రాత్రి సమయంలో నిర్మాణం చేపడుతున్నారని గ్రామంలో నాయకులు ఆ నిర్మాణం వద్ద ముట్టడించారు. ఇప్పటికే ఈ నిర్మాణంపై కోర్టులో కేసులు నడుస్తుండగా కోర్టు స్టేటస్‌కో ఇచ్చినట్టు పంచాయతీ అధికారులు చెబుతున్నారు. నిర్మాణం చేపట్టవద్దని అధికారులు వారించినా నిర్మాణదారుడు స్లాబు వేయడంతో ఉద్రిక్తత నెలకొంది. దీనిపై గ్రామ పంచాయతీ అత్యవసర సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆస్తులను ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారని వాటి నిర్మాణాలు అడ్డుకోకుంటే ఆక్రమణలు పెరుగుతాయని అక్రమ నిర్మాణం కూల్చాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, జడ్పీ సీఈవోలకు పంపుతామని సర్పంచ్ యు.చంద్రిక తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ విషయంపై రూరల్ ఎస్‌ఐ ప్రసాద్‌ను వివరణ కోరగా వీఆర్‌వో నాగరాజు ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణం చేపట్టడమే కాకుండా అధికారుల విధులకు ఆటంకం కలిగించారని నిర్మాణదారుడు తానేటి శ్రీనివాసరావు, మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు.



ఆందోళన చేస్తున్న పీచుపాలెం కాలనీవాసులు

మద్యం షాపు వద్దంటూ కాలనీవాసుల ధర్నా

నరసాపురం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మద్యం షాపులు ఏర్పాటు చేయొద్దంటూ బుధవారం పీచుపాలెం రాజీవ్‌నగర్ కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం పక్కన మద్యం షాపు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. మహిళలు, స్కూల్ విద్యార్థులు తిరిగే ప్రదేశంలో షాపు ఏర్పాటు చేస్తే మందుబాబులతో ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. అధికారులు ఇక్కడ షాపు ఏర్పాటును నిలుపుదల చేసి మరో ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బళ్ల సాయిమోహన్, మనోహర్, మార్గదశ్, ప్రసాద్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు, విప్‌లు



సీఎంను కలిసిన ధర్మరాజు, ప్రభుత్వ విప్‌లు

ఉంగుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబును మంగళగిరిలో బుధవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ప్రభుత్వ విప్‌లు తాడేపల్లిగూడెం, నరసాపురం ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు కలిశారు. నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్ళారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలను విప్‌లుగా నామినేట్ చేయడంపై ధన్యవాదాలు తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



కొయ్యలగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె్రపతాప్‌శివ కిశోర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పిటిషనర్లతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అభయ మహిళా రక్షక దళాలను పాఠశాలలు, బస్టాండ్‌ల వద్ద గస్తీ తిరగాలని ఆదేశించారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ బాలసురేష్, ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఏలూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ, రెజ్లింగ్ పోటీలకు 26వ సచివాలయం వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శిగా పనిచేస్తున్న మానుకొండ రాజ్‌కుమార్ ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి కబడ్డీ, రెజ్లింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచాడు. నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ బుధవారం రాజ్‌కుమార్‌ను అభినందించారు.

జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ టోర్నీకి విద్యార్థినుల ఎంపిక



క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్, పీడీ

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఈ నెల 9 నుంచి 11వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాలికల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో, కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్, ఫిజికల్ డైరెక్టర్ అండాళ్ళు తెలిపారు. పి.జయశ్రీ, డి.సాయిభవాని, బి.దేవిశ్రీ, హ్యాండ్‌బాల్ టోర్నీ నుంచి కె.జ్యోత్స్న జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ టోర్నమెంట్‌లకు ఎంపికయ్యారన్నారు. వీరంతా పంజాబ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఏపీ నుంచి పాల్గొనే జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

జంగారెడ్డిగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మానికల మహాలక్ష్మి జాతీయ స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. అక్టోబరు 9 నుంచి 11 తేదీ వరకు విజయనగరంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో మహాలక్ష్మి, కొవ్వూరు మండలం ధర్మవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కడియం మహాశ్రీలక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో డిసెంబరులో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ పి.గ్లోరీ ప్రశాంతి, పీడీ ఎం.వెంకటలక్ష్మి అభినందించారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తలసేఈమియా చిన్నారులకు ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి చెప్పారు. 15 మంది చిన్నారులకు రక్తమార్పిడి చేయగా వారికి సహాయకులుగా వచ్చిన వారికి కూడా ఉచిత భోజన వసతిని సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దేవినేని భాస్కరరావు సమకూర్చారు. ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ ఎస్ఆర్‌కే వర ప్రసాదరావు, డాక్టర్ స్పందన, పలువురు పాల్గొన్నారు.

సాగు పరికరాలు ఎపుడిస్తారో..

» వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేత » తీవ్ర ఇబ్బందిపడిన రైతులు » కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

వ్యవసాయానికి పెద్దపీట వేశామని చెప్పుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. ఐదేళ్లూ అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ప్రధానంగా వ్యవసాయ పరికరాలు, సూక్ష్మపోషకాలకు మంగళం పాడింది. చివరకు టార్పాలిన్‌లను కూడా అందించలేకపోయింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో వీటిని రాయితీ పై పంపిణీ చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం విస్మరించడంతో రైతులు అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.



ఏలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగుకు యంత్రపరికరాలు ఎంతో అవసరం. స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు రైతులకు సాగులో సహాయ కారిగా ఉంటాయి. మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మపోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. గత ఐదేళ్ళు రాయితీ పై వీటిని పంపిణీ చేయలేదు. రైతులు కష్టాలు పడ్డారు. ప్రధానంగా స్ప్రేయర్లు కొరతను ఎదుర్కొన్నారు. వైసీపీ హయాంలో స్ప్రేయర్లు కోసం వ్యవసాయశాఖ కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మందు పిచికారీ చేయటానికి రైతులు ఇబ్బంది పడ్డారు. గత టీడీపీ హయాంలో తైవాన్ స్ప్రేయర్లను పంపిణీ చేసింది. స్ప్రేయర్లతో పాటు కల్టివేటర్లు, పవర్‌వీడర్, ట్రాక్టర్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

సూక్ష్మపోషకాల కోసం పాట్లు

సూక్ష్మపోషకాలు లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం వాటిని రైతులకు అందించేది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. జింకు, బోరాన్, మెగ్నీషియమ్, పొటాషియమ్ కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వాటి ధరలు అమాంతం పెరగడంతో రైతుల పై ఆర్థిక భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు ఆశలు చిగురిస్తున్నాయి. యంత్రపరికరాలు, సూక్ష్మపోషకాల ఎదురుచూస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. తుఫాన్ విలయంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. సరైన సమయానికి టార్పాలిన్‌లు ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు.

వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి



వైసీపీ ప్రభుత్వంలో రైతులకు వ్యవసాయ పరికరాలు అందక బయట మార్కెట్లో కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. కేవలం ట్రాక్టర్లతో సరి పెట్టారు. అది కూడా అసలైన రైతుకు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వ్యవసాయ పరికరాలు అందించాలి.

- వాడపల్లి రామారావు, మాదేపల్లి

సూక్ష్మపోషకాలు పంపిణీ చేయాలి



సబ్సిడీతో అందించే సూక్ష్మపోషకాలను గత వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. స్ప్రేయర్లు, టార్పాలిన్ పంపిణీ నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ పరికరాల కోసం ఎదురుచూడకుండా అందచేయాలి. సేద్య పరికరాల పంపిణీ కూడా సులభతరం చేయాలి **- సున్నా వెంకట్రావు, పోతునూరు**

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. ఇకపై సంక్షోభం అనే మాటకు తావులేకుండా సంక్షేమం దిశగా రాష్ట్రం ముందుకెళ్తుందన్నారు. పార్టీనాయకులు బి.సుధాకర్, టి.సత్యనారాయణ, ఎం. నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, సంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు, రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు టూ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి బుధవారం వినతులు స్వీకరించారు. మహేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఎటువంటి కృషి చేయాలేదన్నారు. రాష్ట్రాభివృద్ధిని విస్మరించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలపై కేంద్ర మంత్రులు ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేశానని అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రయోగశాల పునః నిర్మాణానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగానే రాష్ట్రానికి బయోగ్యాస్ యూనిటు వచ్చిందన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాన్నారు. ఇండస్ట్రీయల్ జోన్‌గా జిల్లాను తీర్చిదిద్దుతానని అన్నారు. జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, పూజారి నిరంజన్ పాల్గొన్నారు.



ఏలూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేష్

● భీమడోలు : కార్యకర్తల సంక్షేమం తెలుగు దేశం పార్టీతోనే సాధ్యపడుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఆగడాల లంకలో పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ముందుగా ఆగడాలలంకలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ దృష్టికి ముంపు మండలాల సమస్యలు

కుక్కునూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, వేలేరుపాడు ముంపు మండలాల సమస్యలను ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ దృష్టికి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు తీసుకువెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కుక్కునూరులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని మరలా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలో పోస్టు మార్టం ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఉప సర్పంచ్ పి.రాజు, వేలేరుపాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అశోక్ ఉన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు టూ టౌన్/పెదవేగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వారోత్సవాలను కలెక్టర్ వెట్రిసెల్వి ప్రారంభిస్తారన్నారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు, కవి సమ్మేళనం, పుస్తకప్రదర్శనలు, వివిధ అంశాలపై చర్చ నిర్వహిస్తామన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చాటపర్రులోని చంద్రబాబునాయుడు కాలనీ, ఎస్సీకాలనీ, బాబుఖాన్ గూడెం, చాటపర్రు రోడ్డు ప్రాంతాల్లో చెట్లు నరకడం కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంట గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్ అధికారి కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు కొల్లేరు పరిరక్షణ సదస్సు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సు పరిరక్షణకై సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఆర్ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో సదస్సు జరుగుతుందని ఏలూరు జిల్లా కార్యదర్శి ఎంకే చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

16న సీఆర్ఆర్ కాన్వొకేషన్ డే

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 16న స్నాతకోత్సవాన్ని(కాన్వొకేషన్ డే) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. నన్నయ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కళాశాలలో 2022లో యూజీ, పీజీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీ(ఓడీ)లను అందజేస్తారని, విద్యార్థులు తమవెంట డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీని తీసుకురావాలని పరీక్షల కంట్రోలర్ ఫణి కుమార్ సూచించారు.

ఏకాదశ రుద్రుల దర్శనం

ఉంగుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు ఏకాదశ రుద్రుల దర్శనం సర్వీసు నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎ.సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వేశ్వర రుద్రుడు, మహాదేవ రుద్రుడు, వంటి 11 క్షేత్రాలను దర్శనం చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. టికెట్టు రూ.350లు నిర్ణయించామన్నారు. మరింత సమాచారానికి 99592 25488, 94909 25531, 73829 05856, 73829 08412, 99597 53102లలో సంప్రదించాలన్నారు.

మొబైల్ లైబ్రరీ చిన్నారులకు ఉపయోగం

బుట్టాయగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేఆర్ పురం ఐటీడీఏ ఆధ్వర్యంలో నడపబడుతున్న మొబైల్ లైబ్రరీ బస్సు అంగనవాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో పి.ధాత్రిరెడ్డి అన్నారు. బుధవారం ఏజెన్సీకి వచ్చిన పీవో ఎస్పీ కె.శివ ప్రతాప్ కిశోర్‌తో కలిసి రెడ్డిగూడెంలో మొబైల్ లైబ్రరీ బస్సును సందర్శించారు. అంగనవాడీ కేంద్రంలోని 1, 2 తరగతుల విద్యార్థులతో ముచ్చటించారు. మొబైల్ లైబ్రరీ బస్సు ప్రయోజనాలను సిబ్బందికి వివరించారు. గ్రామస్తులు పాఠశాల నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా తప్పకుండా సహాయం చేస్తానని జేసీ హామీ ఇచ్చారు. రాజానగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కార్యాలయంలో వన్ ధన్ వికాస్ కేంద్రాలపై సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఏపీవో వీవీఎస్ నాయుడు, డీఎస్పీ వెంకటేశ్వరావు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులతో మాట్లాడుతున్న జేసీ పీవో ధాత్రిరెడ్డి

దళితులకు అన్యాయం జరిగింది

బుట్టాయగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :రామారావుపేట సెంటరుకు చెందిన దళితులకు ఎన్‌హెచ్-365 బీబీ రోడ్డు రీసర్వేలో తీరని అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలంటూ బుధవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితులు ఆందోళన చేశారు. రెడ్డిగణపవరం పంచాయతీ శివారు రామారావుపేట సెంటరులో ఇళ్ల నిర్మించుకుని నివాసము ంటున్నామని ఎన్‌హెచ్-365 బీబీ రోడ్డు తమ గ్రామం మీదుగా వెళుతుందని గతంలో ప్రభుత్వం సర్వే చేసి కొందరు భూస్వాముల భూములు, ఇళ్ల మీదుగా మార్కింగ్ ఇచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మరలా రీసర్వే చేస్తూ భూస్వాముల భూములను తగ్గించి దళితుల ఇళ్ల మీదుగా రోడ్డు వెళ్లేలా మార్కింగ్ చేస్తున్నారని జేసీకి తెలిపారు. పేదలకు అన్యాయం చేస్తున్నవారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ జేసీకి ఇచ్చిన వినతిలో కోరారు. జేసీ తాను స్వయంగా గ్రామం వచ్చి రోడ్డు సర్వే పనులను పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.



ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న దళితులు

జీవన్‌ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోండి

ఏలూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):జీవన్‌ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ప్రతిఒక్క పింఛనర్ తమ ఇంటివద్దనే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించుకోవచ్చని పింఛనర్ల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజూగుప్తా తెలిపారు. బుధవారం ఆర్.ఆర్‌పేటలోని యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను ప్రమోట్ చేస్తున్న దృష్ట్యా పింఛన్‌దారులు ఇక నుంచి వారి ఇంటి నుంచే లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించవచ్చన్నారు. దీనికి గాను ప్రతి పింఛనర్ వారి స్మార్ట్ ఫోన్‌తో ఆధార్, పెసర్‌తో జీవన్ ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నూతన విధానం ద్వారా బ్రాంచ్‌కి వెళ్ళాల్సిన అవసరం లేకుండానే డిజిటల్ రూపంలో లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించవచ్చన్నారు. యుబీఐ రీజనల్ హెడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

ఏలూరు టూ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్యకర్తల కుటుంబాలకు భరోసా అని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు మేయర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. నూర్జహాన్ మాట్లాడుతూ రూ.వందతో సభ్యత్వం తీసుకుంటే ఆ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. నగరంలోని అన్ని డివిజన్స్‌లో సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. బి.శ్రీనివాస్, కార్పొరేటర్లు ఎస్.శ్రీనివాసరావు, కె.నరసింహారావు, శ్రీనివాస్, ఎ.నాగబాబు, ఎస్.కిషోర్, సాంబ, శామ్యూల్, జీ.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



సెల్‌ఫోన్‌లో సభ్యత్వం నమోదు చేస్తున్న మేయర్

185 మందికి వైద్య పరీక్షలు

టి.నరసాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మక్కినవారిగూడెం సచివాలయంలో బుధవారం మోండలేజ్ కంపెనీ, అగ్రో సంస్థల ఆధ్వర్యంలో ఏలూరు వంగాయగూడెంలోని గుడ్ సమారిటన్ కేన్సర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు బ్లెస్సీ, వారి బృందం 185 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ ఎం.గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి కె.పద్మశ్రీ, ఫీల్డ్ ఆఫీసర్ ఎల్.అశోక్, కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం : గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సంధ్యారాణి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

రామలింగేశ్వరరావుకు సత్కారం



రామలింగేశ్వరరావును సత్కరిస్తున్న శేషు,తదితరులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన చిట్టిబోయిన రామలింగేశ్వరరావును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు ఆధ్వర్యంలో సత్కరించారు. ఎస్.రామచంద్రరాజు, బి.సత్యనారాయణ, కె.ఉమాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అల్లరి మూకల ఆగడాలకు చెక్

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆకతాయిల భరతం పట్టేందుకు ఏకంగా ఆర్మ్డు రిజర్వు విభాగానికి చెందిన స్పెషల్ పార్టీ పోలీసులతో రాత్రి పగలు ప్రత్యేక గస్తీ నగరంలో ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ పి.ప్రసాద్, స్పెషల్ పార్టీ పోలీసులు కలిసి నగరంలో బుధవారం తెల్లవారు జాము వరకూ విస్తృతంగా గస్తీ నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. నగరంలో హోటళ్ళు కూడా 11 గంటలు దాటిన తరువాత నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

వాహనంతోనే హెల్మెట్ కొనాలి

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని విక్రయించే సమయంలోనే తప్ప నిసరిగా హెల్మెట్‌ను కూడా కొనుగోలు దారునికి విక్రయించాలని ఏలూరు జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ వాహన డీలర్లను ఆదేశించారు. జిల్లాలోని ద్విచక్ర వాహన డీలర్లతో ఆయన ఏలూరులోని తన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. బీఐఎస్ హెల్మెట్లను విక్రయించాలన్నారు. హెల్మెట్ విక్రయించలేదని అధికారుల దృష్టికి వస్తే సంబం ధిత డీలరుపై చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్‌తోనే ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. ఆర్టీవో ఎండీ, మాదాని, వాహన తనిఖీ అధికారి ఎస్‌బీ శేఖర్, పరిపాలనాధికారి ఎం.రాము పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

భీమడోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లా కెరీయర్ గైడెన్స్ కమిటీ ఛైర్‌పర్సన్ కోడూరి రాధాపుష్పవతి అన్నారు. భీమడోలు హైస్కూలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పది పరీక్షలకు ఏ విధంగా సంసిద్ధత కలిగి ఉండాలి. అందుబాటులో ఉన్న కోర్సులు, నైతిక విలువలతో కూడిన విద్య తదితరాలపై శిక్షణ నిచ్చారు. మండల ఛైర్‌పర్సన్ గుళ్ళ నాగరాజు, తుమ్మల ఉమామహేశ్వరరావు, గుడివాడ సీతారామాంజనేయులు, శారదాదేవి, రమేష్, కె.సత్యనారాయణమూర్తి, సత్యనారాయణ, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

ఎక్సైజ్ దాడులు

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్ అజయ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు ఫణికుమార్, భోగేశ్వరరావు, ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, వారి సిబ్బంది జిల్లాలో దాడులు నిర్వహించారు. చింతలపూడిలో ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లింగపాలెం గ్రామానికి చెందిన బొర్రా సర్వేశ్వరరావును అరెస్టు చేసి అతని వద్ద రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని అనధికార మద్యం దుకాణాలపై దాడులు నిర్వహించారు. కాకినాడ జిల్లా తుని మండలం అన్నవరం గ్రామానికి చెందిన జవ్వాదుల కృష్ణ ప్రస్తుతం కలిదిండి గ్రామంలో ఉంటూ అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్నాడు. దీంతో అతనిని అరెస్టు చేసి ఏడు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పరిమితి మేరకే పండించండి

జంగారెడ్డిగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిమితి మేరకే పొగాకును పండించాలని టుబాకో బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ రైతులకు సూచించారు. స్థానిక టుబాకో బోర్డులో బుధవారం పొగాకు ఉత్పత్తి నియంత్రణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రం వేలం అధికారి బి.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జర భద్రం

ఏలూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అనారోగ్య సమస్య సంభవిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఏలూరుజిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ ప్రజలకు సూచించారు. చాటపర్రు పీహెచ్‌సీ ఆధ్వరంలోబుధవారం ఫ్రైడే డ్రైడే, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత చలివాతావరణం వల్ల దగ్గు, జలుబు, ఆయాసం, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. శీతాకాలంలో వేడివేడి ఆహార పదార్థాలు భుజించి, గోరువెచ్చని నీటిని తాగాలని, దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శ్రీకృష్ణ, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, రామాంజనేయులు, హెల్త్‌సూపర్‌వైజర్ కిరణ్, ఆరోగ్య కార్యకర్త సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చర్చిని ఢీకొన్న లారీ

ఉంగుటూరు,నవంబరు 13 : రోడ్లు భవనాల శాఖ రహదారిలో బుధవారం నారాయణపురం నుంచి గణపవరం వైపు తౌడు లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చర్చిని ఢీకొంది. దీంతో చర్చి గోడలు బీటలు వారాయి. దీనిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ చర్చి విషయమై కోర్టులో స్టే ఉండటం ఈ సంఘటన జరగడంపై చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపుతామని ఎస్సై సూర్య భగవాన్ తెలిపారు.

చిన వెంకన్నను దర్శించుకున్న కమెడియన్ సుభాష్

ద్వారకాతిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని పుష్ప-2 ఫేం కమెడియన్ సుభాష్ బుధవారం ఉదయం సందర్శించారు. స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆలయ పరి సరాల్లో ఆయనను గుర్తించిన భక్తులు, స్థానికులు ఫొటోలు దిగారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ఉంగుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తపన ఫౌండే షన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి ప్రారంభించారు. రామారులో మూడు నెలలు కుట్టు శిక్షణ ఇస్తామన్నారు. సర్పంచ్ డి.సీత, మహిళా మోర్చా జిల్లా కన్వీనర్ ఎ.శోభారాణి, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

'డీఎస్సీ' ఉచిత శిక్షణ వాయిదా

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షార్థులకు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి ప్రారంభం కావలసిన ఉచిత శిక్షణ తరగతులను ఎమ్మెల్సీ కోడ్ కారణంగా నిలిపివేశామని స్టడీ సర్కిల్ నిర్వాహకులు తెలిపారు. కోచింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ అనుమతిని కోరామన్నారు. వివరాల కోసం కార్యాలయ ఫోన్ నెంబరు 75691 84335లో సంప్రదించాలన్నారు.

అందుబాటులో గోనె సంచులు


పెదపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనెసంచులు అందుబాటులో ఉన్నాయని, జిల్లా వ్యవసాయాధికారి ఎస్కే.హబీబ్ భాషా తెలిపారు. సత్యవోలు, సకలకొత్తపల్లి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు నూతన పద్ధతి పై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బి.నెహ్రూ, ఏవో వి.ప్రదీప్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

● లింగపాలెం : వేములపల్లి, ముడిచర్ల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగులో మెళకువలు తెలియజేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతమయ్యేలా చెయ్యడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యమని ఏవో మురళీకృష్ణ అన్నారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి : వేగివాడ, ముండూరు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ఎం.ప్రియాంక రైతులకు పలు సూచనలు చేశారు. పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళాలని ఆమె సూచించారు. మండల ఉద్యానశాఖాధికారిణి కె.రత్నమాల, సెరీకల్చర్ అధికారి రంగారావు, దెందులూరు ఏఎంసీ టెక్నికల్ అసిస్టెంట్ గౌతమ్, రైతులు పాల్గొన్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోండి

బుట్టాయగూడెం : తుఫాను కారణంగా వర్షాలు వచ్చే అవకాశం ఉందని వరి కోతలను మూడు రోజులపాటు వాయిదా వేసుకోవాలని ఏవో డి.ముత్యాలరావు రైతులకు సూచించారు. అచ్చియ్యపాలెంలో పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కోతలు పూర్తిచేసినవారు సురక్షితమైన ప్రాంతాల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలన్నారు. . సెరికల్చర్ ఆఫీసర్ సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు మినరల్ మిక్చర్ అందిస్తున్న హబీబ్ భాషా

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

జంగారెడ్డిగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారి వి.సత్యనారాయణ దుకాణ యజమానులను హెచ్చరించారు. పాన్ ఇండియా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని పలు దుకాణాలలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. రోడ్డు పక్కన వలస కార్మికుల పిల్లలను గుర్తించి వారిని అంగన్‌వాడీ పాఠశాలలో పేర్లు నమోదు చేయించారు. సీడీపీవో పి.బ్యూలా, సీఆర్ఎంటీఎం రమేష్‌కుమార్, పోలీసు హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.లక్ష్మి,విజయలక్ష్మి పాల్గొన్నారు.

● దెందులూర : బాలల హక్కులు, చట్టాలు, ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని స్త్రీ శి శు సంక్షేమ శాఖ పెదపాడు శాఖ ప్రాజెక్టు సీడీ పీవో కె.విజయలక్ష్మి అన్నారు. కొవ్వలి అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ కోఆర్డినేటర్ నిర్మల, సూపర్ వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు, సహాయకుల ఆధ్వర్యంలో విసన్ శక్తి వంద రోజుల కార్యక్ర మంలో భాగంగా బుధవారం చట్టలు బాలల హ క్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచరు నాగవేణీ పాల్గొన్నారు

● ఏలూరు అర్బన్ : జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూలులో ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ బాలల చట్టలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి, ఎంఈవో రంగయ్య, హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.




జలవిహారానికి బయలుదేరిన స్వామి, అమ్మవార్లు

సుదర్శన పుష్కరణిలో.. శ్రీవారి విహారం

కనువిందు చేసిన చినవెంకన్న తెప్పోత్సవం

ద్వారకాతిరుమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుదర్శన పుష్క రిణిలో హంస వాహనాన్ని అధిరోహించిన చినవెంకన్న ఉభయ నాంచారులతో కలసి బుధవారం రాత్రి జల విహారం చేశారు. క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని జరిగిన ఈ తెప్పోత్సవం భక్తులకు నేత్ర పర్వమైంది. కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మ రణలు, అర్చకుల వేదఘోషల నడుమ జరిగిన ఈ ఉత్సవం చూపరులకు కనువిందు చేసింది. ఆలయంలో విశేషంగా అలంక రించిన తొళక్కవాహనంపై స్వామి, అమ్మ వార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పా లంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, సన్నాయి డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. తిరువీధి సేవ అనంతరం వాహనాన్ని సుదర్శన పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. దేదీప్యమానంగా వెలుగొందుతున్న పుష్కరిణిలో హంసవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో సత్యనారాయణమూర్తి స్వామి,అమ్మవార్లకు పూజలు చేశారు. పుష్కరిణి మధ్యనున్న మండపంలో శ్రీవారు. పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను ఉంచి అర్చకులు పూజలు జరిపారు.

చేదు పుట్టిస్తున్న తియ్యని వ్యాధి



నేడు మధుమేహ దినోత్సవం

డయాబెటిస్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్ అని భారత్‌ను పిలవడం మనం సంతోషించదగ్గ విషయం ఎంత మాత్రం కానే కాదు. ప్రగతిలో ముందు ఉన్నామంటే ఆనందదాయకం. పౌరులలో ఒక దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్య విషయంలో ప్రపంచంలోనే మనం ప్రథమంగా ఉన్నామని గుర్తించబడడం విచారించాల్సిన విషయం. ప్రపంచంలో మొత్తం మధుమేహ బాధితులలో 17 శాతం మన దేశంలో ఉండడం గమనార్హం. ప్రతీ పది మంది వయోజనులలో ఒకరికి మధుమేహం ఉంది. ఇప్పుడు దేశంలో దాదాపు 80 మిలియన్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. 2045 నాటికి ఈ సంఖ్య 140 మిలియన్లకు చేరవచ్చని అంచనా. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మధుమేహంతో బాధపడేవారి సంఖ్య పలు గణాంకాల ప్రకారం ఆరు లక్షలు ఉండవచ్చని అంచనా. మధుమేహ వ్యాధి నియంత్రణ కోసం కృత్రిమ ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఫ్రెడరిక్ బాంటింగ్ జయంతి పురస్కరించుకుని నవంబరు 14వ తేదీని ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

పాలకొల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

చక్కెర వ్యాధి, లేదా డయాబెటిక్, లేదా మధుమేహం ఏ పేరుతో పిలిచినా వాటి బారిన పడిన పౌరులు ఔషధాల జోలికి పోకుండానే తమ జీవన శైలిని మార్చుకోవడం ద్వారా 80 శాతం మందిలో సమస్యను నియంత్రించవచ్చని వైద్యవర్గాలు చెబుతున్నాయి. మధుమేహం సమస్య మానవ శరీరంలో ఇన్సులెన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రయత మితబాలిజం మధుమేహంతో బాధపడేవారిలో ప్రధానంగా అతిమూత్రం. అతిదాహం. చూపు తగ్గడం ఆకస్మికంగా బరువు తగ్గడం, మూత్రపిండాల వైఫల్యం, ఆకస్మిక గుండెపోటు, పక్షవాతం వంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి.

ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపుల ద్వారా పశ్చిమ గోదావరి జిల్లాలో చక్కెర వ్యాధితో బాధపడుత్ను వారి సంఖ్య 21,847గా ఉంది బీపీ, చక్కెర వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 62,036గా ఉంది. ఏలూరు జిల్లాలో 23,460 మంది ఉండగా చక్కెర, బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య 74,162గా ఉంది. ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపుల ద్వారా ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సుమారు 30 శాతం పౌరులలో 1లక్షా 80వేల మందికి వ్యాధి ఉందని గుర్తించగా అదే నిష్పత్తిలో మిగిలిన పౌరులలో మరో నాలుగు లక్షల పైబడి చక్కెర వ్యాధి ఉండే అవకాశాలు ఉన్నాయని సంబంధిత శాఖలో నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే మొత్తం ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆరు లక్షలు పైబడిన పౌరులలో మధుమేహం సమస్య ఉంది. దేశంలోని వయోజనులలో 7.7 కోట్లు మందికి మధుమేహం ఉందని గుర్తించారు. ఉమ్మడి జిల్లా విషయానికి వస్తే ప్రతీ పది మందిలో ఒకరికి డయాబెటిస్ ఉన్నట్టు తెలుస్తుంది.

చిరుప్రాయంలోనే మధుమేహం

అత్యంత దురదృష్టకరమైన విషయం చిరు ప్రాయంలోనూ మధుమేహం రావడం. మారుతున్న జీవనశైలి శరీరానికి తగినంత వ్యాయామం లేకపోవడం. ఊబకాయం, తల్లి దండ్రుల ద్వారా వంశపార్యంపరంగానూ పసిపిల్లలు సైతం ఈ వ్యాధి బారిన పడుతు న్నారు.

యువతలో పది శాతం

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్మార్) నివేదిక ప్రకారం మన జనాభాలో ముఖ్యంగా యువతలో గత కంటే ఇప్పుడు పది శాతం మధుమేహం పెరుగుదల కనిపిస్తుంది. పిల్లల్లో సైతం పెరుగుతూ రావడం ఆందోళన కలిగిసుందని ఐసీఎమ్ఆర్ నివేదికలో పేర్కొంది.

మధ్య వయస్సు వారికి తీవ్రం..

ముఖ్యంగా మధ్య వయస్సు వారికి మధుమేహం సమస్య తీవ్రమైంది. అధిక కేలరీల గల ఆహారం తీసుకోవడం, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, ఆందోళనలే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అధికంగా మద్యపానం చేసే వారిలోనూ ధూమపానం చేసే వారిలోనూ వేగంగా ఈవ్యాధి పెరుగుతుంది. వీటికి తోడు కుటుంబ చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) సైతం మధుమేహాన్ని కలుగజేస్తుంది.

డబ్ల్యూహెచ్‌వో స్పందన

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మధుమేహంపై స్పందనను వేగవంతం చేసింది. 2021 ఏప్రిల్‌లో డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ డయాబెటిస్ కాంపాక్ ప్రారంభించింది. నవంబరు 14వ తేదీన ప్రపంచ మధుమేహం వ్యాధి దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

ఇన్సులెన్ ఇంజక్షన్‌లకు చెక్

సెల్‌ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో మధుమేహ బాధితులకు స్వాంతన కల్గించవచ్చని ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన ఓ సదస్సులో పలువురు వైద్యప్రముఖులు ప్రకటించడం పట్ల మధుమేహ సమస్యతో బాధపడుతున్న వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంధ విద్యార్థుల ప్రతిభ



పురస్కారాలతో విద్యార్థులు

ఆగిరిపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ పోటీల్లో హీల్ అంధ పాఠశాల విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. బా లల దినోత్సవ సందర్భంగా అంధ విద్యార్థు లకు తాడిగడప ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూ ట్ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించిన జిల్లా స్థాయి పాటల, నృత్య, పెయింటింగ్ పోటీల్లో హీల్ అంధ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.సాయిబాబు తెలిపారు. సీనియర్ పాటల పోటీల్లో ఇ.షాలిని, జూనియర్స్‌లో సి.హెచ్ కౌసల్య, ప్రథమ స్థానం, ఎ.సాయికృష్ణ, చక్రిక కన్సలేషన్ బహుమతి, నృత్యం సీనియర్స్‌లో వై. ఆకాష్ ద్వితీయ, జూనియర్స్‌లో టి.పూజి త ప్రథమ, ఎ.సాయికృష్ణ చక్రిక ద్వితీయ, పి.రాణి తృతీయ స్థానాలు సాధించగా పెయింటింగ్ పోటీలో లీలా మాధురి ద్వితీ య, తేజ, హరి, ప్రవీణ్ తృతీయ స్థానాలు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, అంధ పాఠశాల చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రుష్మంత్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

బైక్ చోరీ నిందుతుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందుతుడు

కైకలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ పి.కృష్ణ తెలిపారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమా వేశంలో బైక్ చోరీ కేసు వివరాలను తెలిపారు. కైకలూరు పట్టణంలో రెండు చోట్ల ద్విచక్ర వాహ నాలను దొంగలించిన సంఘటనపై కేసు నమో దు చేశామన్నారు. ఎస్సై బి.వెంకటకుమార్, సిబ్బంది బుధవారం కైకలూరు రైల్వేస్టేషన్ దగ్గర వాహనాలను తనిఖీ నిర్వహించారు. తనిఖీలో ఏలూరు సమీపంలోని వట్లూరు గ్రామానికి చెందిన కడవకొల్లు మణికంత వాహనాన్ని తనిఖీ చేయగా చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అత డిపై కేసు నమోదు చేసి రెండు బైకులను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి నీరందించేందుకు పైప్‌లైన్

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్

కలిదిండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూ రుపాడు లాకుల నుంచి పెదలంక గ్రామాల తాగునీటి చెరువుల్లో గోదావరి నీరు నింపడానికి పైపులైన్ ఏర్పాటు కానుందని ఆర్‌డబ్ల్యూఎస్ డిఈఈ శ్రీనివాస్ తెలిపారు. కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణంలో పెద లంక, మట్టగుంట, కొండంగి గ్రామాల సర్పంచ్‌లు, కూట మి నాయకులతో బుధవారం స మావేశం నిర్వహించారు. ఏలూరుపాడు నుంచి పెద లంక వరకు సుమారు 15 కిలోమీటర్ల పైపులైన్ ఏర్పా టు చేయాలని ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచనలు ఇచ్చార ని, పైపులైన్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలి స్తామన్నారు. జల్ జీవన్ మిషన్ గ్రాంటు ద్వారా పైపులైన్ నిర్మాణా నికి ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. అనంతరం పైపులైన్ ఏర్పాటుపై కొండంగి, మట్టగుంట, పెదలంక గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నాయకులతో డీఈఈ శ్రీని వాస్ చర్చించారు. తాగునీటి చెరువులను నింప డానికి ఏలూరుపాడు నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిం చాలని సర్పంచ్‌లు, కూటమి నాయకులు కోరారు. వీలైనంత తొందరగా పైపులైన్ ఏర్పాటు చేయా లని విజ్ఞప్తి చేశారు. జలజీవన్ మిషన్ పథకంలో పైపులైన్ ఏర్పాటుచేసి విద్యుత్ బిల్లు ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏ ఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, పెదలంక, మట్టగుంట, కొండంగి సర్పంచ్‌లు మోకా లక్ష్మీ రామకృష్ణ, అండ్రాజు రత్నమణి, తిరుమలశెట్టి జ్యోతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రఘురామ కృష్ణంరాజుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

డిప్యూటీ స్పీకర్ రఘురామకు కామినేని శ్రీనివాస్ అభినందనలు

కైకలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఎంపికైన కనుమూరి రఘురామకృష్ణంరాజుకు కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగ ణంలో బుధవారం కేక్ చేసి రఘురామకృష్ణ రాజుకు తినిపించారు. శాసనసభ వ్యవహా రాలను డిప్యూటీ స్పీకర్‌గా సక్రమంగా కార్యక్ర మాలను నిర్వహించి సభ గౌరవమర్యాదలను మరింత పెంచేలా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా లంకా రత్నారావు



కలిదిండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలి దిండికి చెందిన లంకా రత్నారావు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితు లయ్యారు. ఆయన పార్టీ సంక్షేమానికి, సంఘ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యుడిగా నియ మించడంపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.



అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజుకు సత్కారం

కలిదిండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రా జు శ్రీనివాస్‌ను టీడీపీ నాయకులు బుధవా రం ఘనంగా సత్కరించారు. పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, ముద్దం భోగేశ్వర రావు, దుగ్గిరాల పరమేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, నాగిడి వీరబ్రహ్మం, పెదలంక, కొండంగి, మట్టగుంట సర్పంచ్‌లు మోకా లక్ష్మీ రామకృష్ణ, తిరుమలశెట్టి జ్యోతి, సుబ్రహ్మణ్యం, అండ్రాజు రత్నమణి తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్లేట్లు వితరణ

మునునూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రమణక్కపేట జడ్పీపాఠశాల అభివృద్ధికి, విద్యా ర్థులకు సౌకర్యాలు కల్పించడంలో దాతల సహకారం అభినందనీయమని నూజివీడు డీవైఈవో ఎం.సేవ్య అన్నారు. గోళ్ళ రమేష్ పాఠశాలకు 50 భోజనం ప్లేట్లను బుధవారం వితరణ అందజేశారు. హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణారావు, ఫస్ట్ అసిస్టెంట్ ఏ.శ్రీనివా సరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి



చాట్రాయిలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చాట్రాయి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మాది గల ఆత్మీయ సమ్మేళనానికి మాదిగలు అంద రూ తరలివచ్చి విజయవంతం చెయ్యాలని ఎమ్మార్పీఎస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ కంకట వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మాది గల ఆత్మీయ సమ్మేళనానికి జన సమీకరణ కోసం మండల నాయకులతో కలిసి కంకట వెంకటేశ్వరరావు బుధవారం గ్రామాల్లో పర్య టించారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించిన తరువాత విజయవాడ వస్తున్న కృష్ణ మాదిగకు మాదిగ జాతి యావత్తు అపూర్వ స్వాగతం పలకాలని కోరారు. రవి రామ్, జోజి, రమేష్, సుజనరావు, లాజరు తది తరులు పాల్గొన్నారు.




పెదగొన్నూరు, కొర్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో అధికారులు, రైతులు

వరి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పెద గొన్నూరు, కొర్రగుంటపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో వేణుమాధవ్ రైతులకు వరి యాజమాన్య పద్ధతులను వివరించారు. వాతావరణ మార్పుల వల్ల వరి పైరు నేలకొరిగితే ధాన్యం కంకులపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచిం చారు. భూసార పరీక్షా ఫలితాలకు అనుగుణం గా ఎరువుల వాడకం ఉండాలన్నారు. మినుము సాగులో మెళకువలను సూచించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఇన్‌చార్జ్ గౌతం కుమార్, సర్పంచ్‌లు తాడంకి శిరీష, పేరే రామకృష్ణ, విఏఏ వినీతి తదితరులు పాల్గొన్నారు.

● మండవల్లి: మండలంలోని పుట్లచెరువు, కొర్లపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్‌కె జరీనా మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పథకాలు వివరించారు. రబీలో అపరాల సాగులో మెలుకువలు తెలి పారు. రైతు సేవా కేంద్రాలలో రైతులకు వీబీఎన్ 8 అనే మినుము విత్తనాలు సబ్సిడీలో రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్పంచ్ యడాలి నాగేశ్వరరావు, వీఏఏలు సుభాని, చాప్లి న్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మత్స్యశాఖ అసిస్టెంట్ వెంకయ్య, రైతులు పాల్గొన్నారు.

సొంత నగదుతో టీడీపీ సభ్యత్వ నమోదు



గోపవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న యువనేత గణేష్

మునునూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలో యువ నేత ఉప్పలపాటి గణేష్ ఆర్థిక సహకారంతో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా జరుగు తోంది. బుధవారం గోపవరం బీసీకాలనీ, ఎస్సీ కాలనీల్లో సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని గణే ష్ నిర్వహించారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.వంద గణేష్ చెల్లిస్తున్నారు. ఇప్పటికి వరకు సుమారు 900 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

హడావుడిగా మిషన్‌తో వరి కోతలు



చెక్కపల్లిలో మిషన్‌తో పంట కోయిస్తున్న రైతు

మునునూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉండి, కారుమబ్బులు కమ్ముతుండటంతో రైతులు హడాహుడిగా మిషన్‌తో వరికోతలు కోస్తున్నారు. మిషన్ వెంటే ట్రాక్టర్లను సిద్ధంగా ఉంచుకుని, ధాన్యాన్ని ఇళ్ళవద్ద మెరుక ప్రాంతాలకు తరలిస్తున్నారు. చెక్కపల్లి, గుడిపాడు, గుళ్ళపూడి, యల్లాపురం, సూరేపల్లి, మునునూరు తదితర గ్రామాల్లో ముమ్మరంగా మిషన్‌తో వరికోతలు కోస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో 50శాతం పైగా వరికోతలు పూరైన నేపధ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు పరదాలు కప్పి బద్రపరుచుకుంటున్నారు. అల్పపీడనం వల్ల వర్షం పడితే చేతికి వచ్చిన పంట నేలపాలైయే ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యకం చేస్తున్నారు.

అభయ మహిళా భద్రతపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

చాట్రాయి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న నేరాలు అరికట్టటా నికి అభయ మహిళా భద్రత పథకాన్ని జిల్లా యస్పీ ప్రవేశపెట్టారని దీనిని వినియోగించుకో వాలని ఎస్సై రామకృష్ణ కోరారు. చాట్రాయిలో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం విద్యా ర్థినిలతో ర్యాలీ మానవహారం నిర్వహించి స్థానిక వికాస్ కాలేజిలో అవగాహన కల్పిం చారు. అ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళల భద్రత కోసం మహిళా పోలీస్ సిబ్బం దితో అభయ బీట్లు ఏర్పాటు చేశామని, ఆపదలో ఉన్నవారు 112కు ఫోన్ చేస్తే 10 నిమి షాలతో పోలీసు సహాయం అందుతుందన్నారు. బాల్య వివాహాలకు ఎవరైనా ప్రయత్నిస్తే 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలని సమా చారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సైబర్ నేరగాళ్ళ వలలో పడి డబ్బు పోగొట్టుకుంటే 1930కి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఊపందుక్ను సీసీ రోడ్ల నిర్మాణం

మునునూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ఊపందుకున్నాయి. బుధవారం వలస పల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షులు ఎం.సురేంద్ర పర్యవేక్షణలో అంతర్గత రహదారులను చదును చేసి, రోలింగ్ చేసే పనులు చేపట్టారు. అలాగే మునునూరులో సర్పంచ్ తనయుడు నియోజక వర్గ తెలుగు యువత కార్యాదర్శి కె. ఉదయ్‌కిరణ్(బాబి) ఆధ్వర్యంలో సీసీ రోడ్ల ప నులు వేగంగా జరుగుతున్నాయి. లోపూడి, చెక్క పల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వైసీ పీ పాలనలో గ్రామాల్లో ఒక్క సీసీ రోడ్డు నిర్మా ణం జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలల వ్యవధిలోనే సీసీరోడ్లు నిర్మాణం చేపట్టడం, బురదమయంగా ఉన్న అంతర్గత రహదారులు సైతం అభివృద్ధి చెందుతుండటం తో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో వీరంగం చేసిన యువకుడిపై కేసు నమోదు

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో స్టేషన్ సిబ్బందిని బెదిరించటమే కాక, బ్లేడుతో శరీరం కోసుకుని వీరంగం చేసిన పూటుకూరుకు చెందిన పోసిన సురేష్ అనే యువకుడిపై కేసు నమోదయింది. స్టేషన్‌కు వచ్చి పోలీసు సిబ్బందిని దుర్భాష లాడుతూ సెప్టెంబరు 7న తన తండ్రి బాలకో టయ్య హత్యకు పోలీసులే కారణమంటూ కేకలు వేస్తూ సిబ్బందిని, స్థానిక ప్రజలను భయభ్రాం తులకు గురి చేసిన సంఘటనలపై వివిధ సెక్షన్ల కింద ఏఎస్ఐ ఎ.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. రక్తం కారుతున్న శరీరంతో ఉన్న ఆ యువకుడిని గుడివాడ ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరంగం జరిగిన తీరు ఇదీ

ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు పూటుకూరుకు చెందిన పోసిన సురేష్ అర్ధనగ్నంగా మంగళ వారం రాత్రి వచ్చి ఇటీవల తన తండ్రి బాలకో టయ్య చావుకు కారణం పోలీసులే, హంతకులు జైలు నుంచి బెయిలుపై బయటకు రావటానికి కారణం కూడా పోలీసులే అంటూ వీరంగం చేశాడు. తనను ఇటీవల ఓ కానిస్టేబుల్ పూటు కూరులో కొట్టాడు.. దానిపై కేసు గురించి అడి గేందుకు వస్తే పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ గొంతు కోశాడు. అందుకే తాను ఒళ్లంతా కోసుకుంటు న్నా అంటూ బ్లేడుతో శరీరంపై పలు చోట్ల కోసు కున్నాడు. అతన్ని ఆపేందుకు స్టేషన్‌లో ఉన్న సిబ్బంది ఎవరూ ముందుకు రాలేకపోయారు. కొంతసేపటికి కొందరు కానిస్టేబుళ్ల ధైర్యం చేసి ఆ యువకుడిని గుడివాడ ఆస్పత్రికి తరలించారు.

బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఎ.మస్తా నయ్య తెలిపిన వివరాల ప్రకారం చాట్రాయి మండలం పోతనపల్లిలో దాడులు నిర్వహించి, 1500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేయడంతో పాటు గ్రామానికి చెందిన దారావతు గౌరమ్మ, దారావతు పార్వతి, దారావతు ధనలక్ష్మిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15 లీటర్ల సారాను స్వాధీన చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ ఎస్సైలు వై.ఈశ్వర్‌రావు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాములోరిని తాకిన సూర్య కిరణాలు

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం అరుదైన అద్భుతం జరిగింది. ఆలయంలో స్వామివార్ల విగ్రహాలను సూర్య కిరణాలు తాకాయి. ఉదయం ఆలయం వద్ద భక్తులు ఏకాహం భజన, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా సూర్య కిరణాలు సీతారా ముల విగ్రహాలను తాకిన దృశ్యం చూసి భక్తులు పరవశమయ్యారు. సుమారు 20 నిముషాల పాటు సూర్య కిరణాలతో గర్భ గుడి కాంతివంతంగా ఉండడంతో మరింత మంది సీతారామ చంద్రస్వామి దర్శనం చేసుకున్నారు. అర్చకుడు బృందావనం శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.



వణుదుర్రు ఆశ్రమంలో హోమాలు

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వణుదుర్రులోని రాధాకృష్ణ ఆశ్రమం లో బుధవారం మహా వన సమారాధన జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు ఆశ్రమంలో రాధాకృష్ణులకు పూజలు చేశారు. ఆశ్రమ పీఠాధిపతి పురుషోత్త మానందగిరి స్వామి ఆధ్వర్యంలో అర్ధ చాతుర్మాస పూర్ణాహుతి, హోమం, భగవద్గీత పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ 41వ వార్షికోత్సవం నిర్వహించి గో పూజలు చేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మునునూరు/కలిదిండి/ముదినేపల్లి నవం బరు 13 (ఆంధ్రజ్యోతి): మునునూరు, గోపవ రం, ముదినేపల్లి, గురజ, కలిదిండి గ్రంథా లయాల్లో 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహి స్తున్నట్లు గ్రంథాలయ అధికారులు బుధవా రం తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అంద జేస్తామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కలిదిండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొచ్చెర్ల గ్రామానికి చెందిన పాస్టర్ దాసరి రాజేంద్ర కుమార్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. ఇంటి పక్కన కట్టేసి ఉన్న రెండు గేదెలకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సర్పంచ్ అల రాము, వీఆర్వో గంగాధర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించి బాధితులను పరామర్శించారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

మండవల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేసేం దుకు ప్రతి కార్యకర్త నడుంబిగించాలని నాయకులు కోరారు. మండవల్లిలో బీజేపీ సమావేశం సమయం ఏసుబాబు అధ్యక్ష తన బుధవారం నిర్వహించారు. నియోజక వర్గ కన్వీనర్ వేంపాటి విష్ణు మాట్లాడుతూ బూత్ స్థాయిలో బలమైన కమిటీలతో సంస్థాగత నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గంగునేని వరప్రసాద్, గుడివాడ చిట్టిబాబు, ఆనందబాబు, బండి దివాకర్, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

ఆగిరిపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ ఇలవేల్పు శోభనాచల లక్ష్మీనరసిం హస్వామి శోభనగిరి ప్రదక్షణ అత్యంత వైభ వంగా జరిగింది. మంగళ వాయిద్యాలు అ య్యప్పస్వామి దీక్షపరులు, భవాని మాలదా రులు వెంటరాగా బుధవారం ఉదయం గిరి ప్రదక్షణ పూర్తి చేశారు. అనంతరం జరిగిన అన్న వితరణలో భక్తులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కైంకర్యపరులుగా మాదల శివరాం ప్రసాద్, నీలిమ దంపతులు పాల్గొన్నారు.